www.siddipetpower.com

# సిద్దిపేట పవర్

తెలుగు దినపత్రిక

SIDDIPET POWER TELUGU DAILY


సంపుటి: 01 | సంచిక: 176 | హైదరాబాద్ | శనివారం | 18-10-2025 | పేజీలు: 05 | ఎడిటర్ : తుక్కోజు గణేష్ బాబు

## కేంద్ర ప్రభుత్వ పథకాల పేరుతో మోసం.. జర భద్రం




**తెలంగాణబ్యూరో, సిద్దిపేట పవర్**

కేంద్ర ప్రభుత్వ పథకాల పేరుతో సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారని.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ పోలీసు శాఖ ప్రకటన జారీ చేసింది. వాట్సప్ గ్రూపుల్లో ఫేక్‌లింక్స్ పంపుతున్నారని.. కేంద్ర ప్రభుత్వ పథకాలంటూ ప్రచారం చేస్తున్నారని పేర్కొంది. ఆయా పథకాలకు అర్హత చెక్ చేసుకోవాలని.. తొందరపడి ఎవరూ లింక్‌లు క్లిక్ చేయొద్దని సూచించింది. కేవలం అధికారిక వెబ్‌సైట్లు మాత్రమే వాడాలని పోలీసులు తెలిపారు. అపరిచితులు పంపించే లింక్‌లు, మెసేజ్‌లకు స్పందించవద్దని పేర్కొన్నారు.




## స్థానిక ఎన్నికలు ఎప్పుడు?

### స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై హైకోర్టులో విచారణ

- ప్రభుత్వం, ఈసీని ప్రశ్నించిన హైకోర్టు
- నిర్ణయం చెప్పేందుకు రెండు వారాల సమయం కోరిన అధికారులు
- విచారణ రెండు వారాలకు వాయిదా
- బీసీ రిజర్వేషన్ల సమస్య వల్లే నోటిఫికేషన్ నిలిపివేశామని కోర్టుకు తెలిపిన ఈసీ
- తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసిన ఉన్నత న్యాయస్థానం

**తెలంగాణ బ్యూరో, సిద్దిపేట పవర్ :**

తెలంగాణ స్థానిక ఎన్నికల నిర్వహణపై కీలక పరిణామాలు చూటుచేసుకుంటున్నాయి. తాజాగా హైకోర్టులో మరో పిటిషన్ దాఖలైంది. స్థానిక ఎన్నికలపై రీనోటిఫికేషన్ ఇచ్చి ఎన్నికలు నిర్వహించాలని పిటిషన్ లో దాఖలు చేశారు. సుప్రీంకోర్టు ఈసీ నోటిఫికేషన్ ను సస్పెండ్ చేయడాన్ని సవాల్ చేస్తూ పిటిషన్ న్యాయవాది సురేందర్ పిటిషన్ వేశారు. దీనిపై ఇవాళ అత్యున్నత న్యాయస్థానంలో విచారణ జరిగింది. వాదనలు విన్న హైకోర్టు.. ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారో చెప్పాలని ప్రభుత్వం, ఎన్నికల కమిషన్ ను ప్రశ్నించింది. ఎన్నికలు నిర్వహణపై సమాధానం చెప్పేందుకు రెండు ..మిగతా 2లో

## సీపీఎం మద్దతు కోరిన కాంగ్రెస్

- సీపీఎం కార్యదర్శి జాన్‌వెస్లీతో టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ భేటీ
- కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ కుమార్‌కు సపోర్ట్ చేయాలని విజ్ఞప్తి
- ఈ నెల 20న నిర్ణయం ప్రకటిస్తామన్న సీపీఎం

02





## రేవంత్ రెడ్డి గన్ కల్చర్ తీసుకువచ్చారు..

- కాంగ్రెస్ నాయకులు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపణ
- కేటీఆర్ వర్షం పడుతుంటే గుర్నానీకి గొడుకు పట్టి పెట్టుబడులను ఆహ్వానించారని వ్యాఖ్య
- ఏం సాధించారని ప్రజా విజయోత్సవాలు నిర్వహిస్తున్నారని నిలదీత

03

## దేశ పురోగతికి నదులే రహదారులు

### జలమార్గాల అభివృద్ధిపై కేంద్ర మంత్రి సోనోవాల్ వ్యాసం షేర్ చేసిన ప్రధాని మోదీ

- జలమార్గాల అభివృద్ధిపై కేంద్ర మంత్రి సోనోవాల్ వ్యాసం షేర్ చేసిన ప్రధాని మోదీ
- 2014లో 5గా ఉన్న జాతీయ జలమార్గాలు ఇప్పుడు 111కి పెంపు
- పదేళ్లలో 18 నుంచి 145 మిలియన్ టన్నులకు చేరిన సరకు రవాణా
- రివర్ టూరిజంలోనూ భారీ వృద్ధి... 25 క్రూయిజ్ నౌకలు ఏర్పాటు
- వికసిత్ భారత్ లక్ష్యంలో జలమార్గాలే కీలకమన్న కేంద్రం



**నేషనల్ బ్యూరో, సిద్దిపేట పవర్ :**

భారతదేశ నదులు కేవలం వారసత్వ చిహ్నాలు మాత్రమే కావని, అవి దేశ ప్రగతికి కొత్త రహదారులుగా మారాయని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అభిప్రాయపడ్డారు. గత కొన్నేళ్లుగా దేశంలో జలమార్గాలను అభివృద్ధి చేయడం ద్వారా రవాణా, పర్యాటక రంగాలు బలోపేతం అయ్యాయని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు కేంద్ర మంత్రి శర్బానంద సోనోవాల్ రాసిన ఒక ప్రత్యేక కథనాన్ని ప్రధాని శుక్రవారం తన 'ఎక్స్' సోషల్ మీడియా ఖాతాలో పంచుకున్నారు. "వికసిత్ భారత్ నిర్మాణం దిశగా పునరుజ్జీవం పొందిన మన జలమార్గాలు ఎలా పయనిస్తున్నాయో" వివరిస్తూ ..మిగతా 2లో



## తొందరపడి దళారుల చేతిలో పడొద్దు..

- రైతులు పత్తి అమ్ముకోవడం కోసం అన్ని చర్యలు తీసుకుంటున్నాం
- 12 శాతం తేమ ఉన్నా సీసీఐ పత్తి కొంటుంది
- తెలంగాణలో 122 కొనుగోలు కేంద్రాలు

**తెలంగాణ బ్యూరో, సిద్దిపేట పవర్ :**

రైతులు పత్తి అమ్ముకోవడం కోసం అన్ని చర్యలు తీసుకుంటున్నాం అని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చెప్పారు. రైతులు తొందరపడి దళారుల చేతిలో పడొద్దని, పత్తి కొనుగోలు ..మిగతా 2లో

## ఆస్తులమ్మి పార్టీని బతికిస్తే ఇదేనా బహుమానం?



- మంత్రి పదవి దక్కకపోవడంపై రాజగోపాల్ రెడ్డి తీవ్ర అసంతృప్తి
- పార్టీ కోసం ఆస్తులమ్ముకున్నా తనను మోసం చేశారని ఆవేదన
- మాట ఇచ్చి కాంగ్రెస్ తప్పిందని ఆగ్రహం
- బీఆర్ఎస్, బీజేపీ నుంచి వచ్చిన వారికి పెద్దపీట వేశారన్న రాజగోపాల్ రెడ్డి

**తెలంగాణ బ్యూరో, సిద్దిపేట పవర్ :**

కాంగ్రెస్ పార్టీలో మంత్రి పదవుల వ్యవహారం మరోసారి కలకలం రేపింది. తనకు మంత్రి పదవి దక్కకపోవడంపై మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సొంత పార్టీయే తనను దారుణంగా మోసం చేసిందంటూ ఆయన సంచలన ఆరోపణలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "కాంగ్రెస్ పార్టీని కాపాడటం కోసం నేను నా సొంత ఆస్తులు అమ్ముకున్నాను. అయినా పార్టీ ..మిగతా 2లో

## సమస్యలు సహజమే..

- అవి టీ కప్పులో తుఫాన్ లాంటివి
- ఏఐసీసీ, పీసీసీ ఇన్‌ఛార్జ్‌లు చూసుకుంటారు
- బీసీ రిజర్వేషన్‌పై పోరాటం ఆగదు
- ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి



03



## బీసీ బిల్లును బీజేపీ అడ్డుకుంటోంది

- పార్లమెంటులో ఆమోదం తెలపలేదు
- రాష్ట్ర బీజేపీ నేతలు ఎందుకు చొరవ తీసుకోవడం లేదు
- ఢిల్లీకి అఖిలపక్షం వెళ్లాలి.. బీజేపీ కూడా కలిసిరావాలి
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

**తెలంగాణ బ్యూరో, సిద్దిపేట పవర్ :**

తెలంగాణ రాష్ట్రంలో బ్యాక్‌వర్డ్ క్లాసెస్ (బీసీ) రిజర్వేషన్లను 42 శాతానికి పెంచే బిల్లు విషయంలో రాజకీయ రగడ కొనసాగుతోంది. రాష్ట్ర అసెంబ్లీ ఆమోదించి కేంద్రానికి పంపినా, ఈ బిల్లు పెండింగ్‌లో ఉండటంతో కాంగ్రెస్ ప్రభుత్వం బీజేపీ తీరుపై విమర్శలు చేస్తోంది. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఖమ్మంలో మీడియాతో మాట్లాడుతూ, కేంద్రం బిల్లును ..మిగతా 2లో

## కొండా సురేఖ పదవికి గండం?



- సొంత పార్టీలోనూ విమర్శలు, వివాదాలు
- సురేఖ మీద ఓ వర్గం నేతలు కక్ష గట్టారా?
- కూతురు సుస్మిత ఆరోపణల్లో నిజమెంత?
- అధిష్ఠానం దాకా వెళ్లిన పంచాయితీ
- మీనాక్షి నటరాజన్ జోక్యంతో సద్దుమణుగుతుందా?
- గతంలోనూ అనేక సార్లు సురేఖ వివాదాస్పద వ్యాఖ్యలు

**తెలంగాణ బ్యూరో, సిద్దిపేట పవర్ :**

తెలంగాణ ఎండోమెంట్స్ మంత్రి కొండా సురేఖ రాజకీయ భవిష్యత్తుపై ఊహాగానాలు వ్యక్తమవుతున్నాయి. సొంత పార్టీ నేతలపై ఆమె చేస్తున్న విమర్శలు, గతంలోని వివాదాస్పద వ్యాఖ్యలు, తాజాగా ఓఎస్డీపై ..మిగతా 3లో



02

## ప్రభుత్వ భూమిని కాపాడిన హైడ్రా

- 1.30 ఎకరాల సర్కారు భూమి సేఫ్
- ఆ భూమిని ఆక్రమించుకున్న అశోక్ సింగ్

## సామాన్యుడికి లాభం చేకూర్చని పరిశోధన నిష్ఫలం

- సుల్తాన్‌పూర్ మెడికల్ డివైసెస్ పార్క్‌లో హ్యూవెల్ కొత్త కెమిస్ట్రీ ల్యాబ్ ప్రారంభం
- ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- కోవిడ్ సమయంలో టెస్ట్ ధరను భారీగా తగ్గించిన హ్యూవెల్‌ను అభినందించిన కేటీఆర్



03

www.siddipetpower.com

WWW.SIDDIPETPOWER.COM

# సీపీఎం మద్దతు కోరిన కాంగ్రెస్

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీతో టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ భేటీ
- కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ కుమార్‌కు సపోర్ట్ చేయాలని విజ్ఞప్తి
- మద్దతుపై ఈ నెల 20న నిర్ణయం ప్రకటిస్తామన్న సీపీఎం

**తెలంగాణ బ్యూరో, సిద్దిపేట పవర్ :**

జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికల వేడి పెరుగుతున్న కొద్దీ, రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతుండగానే, అధికార కాంగ్రెస్ పార్టీ మిత్ర పక్షాల మద్దతు కూడగట్టే ప్రయత్నాలను ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ శుక్రవారం హైదరాబాద్‌లోని సీపీఎం రాష్ట్ర కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీతో సమావేశమయ్యారు. ఈ భేటీలో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ తరఫున పోటీ చేస్తున్న అభ్యర్థి నవీన్‌కుమార్ యాదవ్‌కు మద్దతు ఇవ్వాలని మహేశ్ కుమార్ గౌడ్ సీపీఎంను కోరారు. అలాగే, స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల సాధన కోసం ప్రభుత్వం చేస్తున్న పోరాటంలో కలిసి రావాలని విజ్ఞప్తి చేశారు. టీపీసీసీ చీఫ్ ప్రతిపాదనపై జాన్‌వెస్లీ స్పందిస్తూ, ఈ విషయంపై ఇప్పటికే తమ పార్టీ నగర కమిటీతో చర్చిస్తున్నట్లు తెలిపారు. మద్దతుపై తుది నిర్ణయాన్ని ఈ నెల 20వ తేదీన జరిగే సీపీఎం రాష్ట్ర కమిటీ సమావేశంలో తీసుకుని అధికారికంగా ప్రకటిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఇదే సమావేశంలో బీసీ రిజర్వేషన్ల అంశంపై ప్రభుత్వం వెంటనే అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని జాన్‌వెస్లీ సూచించారు. ఈ సూచనకు మహేశ్ కుమార్ గౌడ్ సానుకూలంగా స్పందించారు. ఈ భేటీతో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల బరిలో పొత్తులు, మద్దతులపై రాజకీయ



# ఆస్తులమ్మి పార్టీని బతికిస్తే ఇదేనా బహుమానం?

**మొదటిపేజీ తరువాయి**

నన్ను మోసం చేసింది" అని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి పదవి ఇస్తామని స్పష్టమైన హామీ ఇచ్చి, ఇప్పుడు మాట తప్పారని ఆయన మండిపడ్డారు. ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి కాంగ్రెస్ పెద్దపీట వేస్తోందని ఆయన ఆరోపించారు. "బీఆర్ఎస్ నుంచి వచ్చిన నలుగురికి మంత్రి పదవులు కట్టబెట్టారు. బీజేపీ నుంచి వచ్చిన వివేక్ వెంకటస్వామికి మంత్రి పదవి, ఆయన కుమారుడికి ఎంపీ టికెట్ ఇచ్చారు. కానీ, పార్టీ కోసం కష్టపడిన నన్ను మాత్రం పక్కన పెట్టారు" అని రాజగోపాల్ రెడ్డి వాపోయారు. కాంగ్రెస్‌లోని కొందరు నాయకులే తనకు మంత్రి పదవి రాకుండా అడ్డుకుంటున్నారని ఆయన ఆరోపించారు.



పార్టీ కోసం ఎంతో త్యాగం చేసిన తనకు అన్యాయం జరిగిందనే భావనతో ఆయన తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నట్టు స్పష్టమవుతోంది.

# ప్రభుత్వ భూమిని కాపాడిన హైడ్రా

**తెలంగాణ బ్యూరో, సిద్దిపేట పవర్ :**

హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్ అథారిటీ (హైడ్రా) ఇటీవల గోషామహల్ నియోజకవర్గంలోని కుల్సుంపురాలో 1.30 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమణల నుంచి విముక్తి చేసింది. రూ.110 కోట్ల విలువైన ఈ భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుని, ప్రజావసరాలకు వినియోగించాలని భావిస్తోంది. అయితే, ఈ భూమిని తన సొంతమని చెబుతున్న అశోక్ సింగ్‌పై ఇప్పటికే 8కి పైగా కేసులు నమోదయ్యాయి. సిటీ సివిల్ కోర్టు ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు ఇచ్చినా, అతడు స్థలాన్ని ఖాళీ చేయకుండా అధికారులపై దాడులకు పాల్పడిన ఆరోపణలు ఉన్నాయి. హైడ్రా ఈ ఆక్రమణలను తొలగించడం ద్వారా ప్రభుత్వ భూములను కాపాడుతున్నామని చెబుతోంది.

అయితే, ఈ ఆపరేషన్‌ను మరో కోణంలో చూస్తే, హైడ్రా చర్యలు ప్రధానంగా పేదలు, మధ్యతరగతి వర్గాల గుడిసెలు, చిన్న నిర్మాణాలపైనే కేంద్రీకృతమవుతున్నాయని విమర్శలు వినిపిస్తున్నాయి. విపక్షాలు, సామాజిక కార్యకర్తలు హైడ్రా 'బుల్డోజర్ పాలసీ'ని అనుసరిస్తోందని, పేదల ఇళ్లను మాత్రమే కూల్చివేస్తున్నారని ఆరోపిస్తున్నారు. మూసి నది ఒడ్డున పెద్ద బిల్డర్లు, ధనికులు నిర్మించిన భారీ ప్రాజెక్టులను వదిలేసి, చిన్న చిన్న ఆక్రమణలపైనే దాడి చేస్తున్నారని వాదనలు ఉన్నాయి. ఉదాహరణకు, ఓవైసీ కాలేజీ వంటి ప్రముఖులకు చెందిన నిర్మాణాలపై చర్యలు తీసుకోకపోవడం వల్ల హైడ్రా విశ్వసనీయతను కోల్పోతోందని బీజేపీ ఎంపీ ఆరోపించారు. అలాగే, ఆక్రమణల తొలగింపు సమయంలో సరైన నోటీసులు ఇవ్వకుండా, పునరావాసం ఏర్పాటు చేయకుండా చర్యలు తీసుకోవడం న్యాయవ్యతిరేకమని విమర్శలు ఉన్నాయి.



# దేశ పురోగతికి నదులే రహదారులు

**మొదటిపేజీ తరువాయి**

సోనోవాల్ ఈ వ్యాసాన్ని రాశారు. ఒకప్పుడు మన దేశంలో నదులే ప్రధాన రవాణా మార్గాలుగా ఉండేవని, రోడ్లపై ట్రక్కుల హవా పెరగకముందే పట్నా, దిబ్రూగఢ్ వంటి ప్రాంతాల నుంచి కోల్‌కతాకు సరుకులు నదుల మీదుగానే చేరేవని సోనోవాల్ గుర్తుచేశారు. "భారత నదులే మన తొలి హైవేలు. కాలక్రమేణా రైలు, రోడ్డు మార్గాలు రావడంతో వాటి ప్రాధాన్యం తగ్గింది" అని ఆయన తెలిపారు.

ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని ప్రభుత్వం, భారత అంతర్గత జలమార్గాల ప్రాధికార సంస్థ (ఐడబ్ల్యూఏఐ) కృషితో ఇప్పుడు నదులకు మళ్లీ పూర్వ వైభవం వస్తోందని సోనోవాల్ వివరించారు. 2014 వరకు దేశంలో కేవలం 5 జాతీయ జలమార్గాలు మాత్రమే ఉండగా, ఇప్పుడు వాటి సంఖ్య 111కి పెరిగిందని, వీటిలో 32 ఇప్పటికే కార్యకలాపాలు సాగిస్తున్నాయని ఆయన వెల్లడించారు. ఈ మార్పు వల్ల తక్కువ ఇంధన వినియోగం, తక్కువ కాలుష్యం, చౌకైన రవాణా వంటి ప్రయోజనాలు కలుగుతాయని అన్నారు.

జలమార్గాల ద్వారా సరకు రవాణాలో అద్భుతమైన పురోగతి కనిపిస్తోందని గణాంకాలతో సహా వివరించారు. 201314లో కేవలం 18 మిలియన్ టన్నులుగా ఉన్న సరకు రవాణా, 202425 నాటికి 145 మిలియన్ టన్నులకు పెరిగిందని పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తితో 2030 నాటికి 200 మిలియన్ టన్నులు, 2047 నాటికి 250 మిలియన్ టన్నుల లక్ష్యాన్ని ప్రభుత్వం నిర్దేశించుకుందని తెలిపారు.

అదే సమయంలో నదీ పర్యాటకం (రివర్ టూరిజం) కూడా వేగంగా అభివృద్ధి చెందుతోందని సోనోవాల్ అన్నారు. దశాబ్దం క్రితం కేవలం 5 క్రూయిజ్ నౌకలు మాత్రమే ఉండగా, ప్రస్తుతం 13 జలమార్గాల్లో 25 క్రూయిజ్ నౌకలు సేవలందిస్తున్నాయని చెప్పారు. గంగా, బ్రహ్మపుత్ర, కేరళ బ్యాక్‌వాటర్స్ ఈ రంగంలో ముందున్నాయని, వారణాసి, కోల్‌కతా, పాట్నా, గౌహతి వంటి టెర్మినళ్లను ఆధునికీకరిస్తున్నామని ఆయన తన వ్యాసంలో పేర్కొన్నారు.



# తొందరపడి దళారుల చేతిలో పడొద్దు..

**మొదటిపేజీ తరువాయి**

విషయంలో అస్సలు భయపడవద్దన్నారు. పత్తిని మొత్తం కొనుగోలు చేయాలను కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ)ని ప్రధాని మోడీ ఆదేశించారని తెలిపారు. 12 శాతం వరకు తేమ ఉన్నా సీసీఐ పత్తిని కొంటుందని కిషన్ రెడ్డి చెప్పుకొచ్చారు. ఎఫ్‌సీఐ, సీసీఐపై రివ్యూ చేసిన కిషన్ రెడ్డి.. ఈరోజు మీడియాతో కాటన్ ప్రోక్యూర్ మెంట్‌పై మాట్లాడారు.

'గతేడాది తో పోల్చుకుంటే పత్తి ఉత్పత్తి పెరిగే అవకాశం ఉంది. దేశ వ్యాప్తంగా 557 కొనుగోలు కేంద్రాలు ఉంటే.. తెలంగాణలో 122 కేంద్రాలు ఉన్నాయి. గతం కంటే 10 కేంద్రాలు పెంచాము. ప్రాంతీయ భాషల్లో పత్తి సేద్యం, ఉత్పత్తి, అమ్మకం సంబంధిత అంశాలపై కిసాన్ యాప్‌ను రూపొందించడం జరిగింది. అమ్మకం కోసం యాప్‌లో అప్లై చేసుకుంటే అన్ని వివరాలు రైతులకు ఇవ్వడం జరుగుతుంది. జిన్నింగ్ మిల్లులను కూడా గుర్తించడం జరిగింది. 2004 నుండి 2014 మధ్యలో గత కేంద్ర ప్రభుత్వం 24 వేల కోట్ల విలువైన పత్తిని కొనుగోలు చేసింది. 2014 నుండి 2024 మధ్యలో లక్ష 37 వేల కోట్ల విలువైన పత్తిని కొనుగోలు చేసింది. దీపావళి తరవాత పత్తి కొనుగోలు చేస్తాం. యాప్ దీపావళి నుండి అందుబాటులోకి వస్తుంది' అని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు.



'నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు ఉంటాయి. డీలర్ షిప్లు రద్దు చేసి జైలుకు పంపిస్తాం. పీడీ యాక్ట్ కూడా పెడుతున్నాం. ఈ రోజు నుండి 24వ తేదీ వరకు పత్తి కొనుగోలు, మొబైల్ యాప్‌పై అధికారులు అవగాహన కార్యక్రమాలు చేస్తారు. సర్దార్ పటేల్ కారణంగా హైదరాబాద్ సంస్థానంలో మూడు రంగుల జండా ఎగిరింది. ఈ సంవత్సరం సర్దార్ పటేల్ 150 వ జయంతి ఉత్సవాలు ఘనంగా చేయాలని నిర్ణయం తీసుకున్నాం. యువత కేంద్రంగా కార్యక్రమాలు జరుగుతాయి. అక్టోబర్ 31 నుండి నవంబర్ 25 వరకు ఈ కార్యక్రమాలు పెద్ద ఎత్తున జరగాలని నిర్ణయించాము. ప్రజాప్రతినిధుల మూడు రోజుల పాదయాత్ర ఉంటుంది, వివిధ కార్యక్రమాలు ఉంటాయి. జిల్లా కలెక్టర్లు సమన్వయం చేస్తారు. 2047 వికసిత భారత్ లక్ష్యంగా కార్యక్రమాలు చేపట్టాం' అని కిషన్ రెడ్డి చెప్పుకొచ్చారు.

# స్థానిక ఎన్నికలు ఎప్పుడు?

**మొదటిపేజీ తరువాయి**

వారాల సమయం ఇవ్వాలని న్యాయస్థానాన్ని ప్రభుత్వం, ఈసీ కోరింది. దీంతో హైకోర్టు ఇందుకు అంగీకరించి రెండు వారాల సమయం ఇచ్చింది. అనంతరం విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. విచారణ సందర్భంగా స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారో చెప్పాలని ప్రభుత్వం, ఎన్నికల కమిషన్‌ను హైకోర్టు ప్రశ్నించింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పెంచూ ప్రభుత్వం జారీచేసిన జీవోను హోకోర్టు కొట్టివేడంతో స్థానిక ఎన్నికల నోటిఫికేషన్ సస్పెండ్ చేస్తూ స్టేట్ ఎలక్షన్ కమిషన్ ఈ నెల 9 న ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. అయితే నోటిఫికేషన్‌ను సస్పెండ్ చేయడానికి సవాలు చేస్తూ సురేందర్ అనే న్యాయవాది హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ జీవో ప్రకారమే ఎన్నికల సంఘం ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసింది. అయితే హైకోర్టు ఆ జీవోపై స్టే విధించింది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టును ఆశ్రయించింది. విచారణ చేపట్టకుండానే అత్యున్నత న్యాయస్థానం సైతం రాష్ట్ర ప్రభుత్వ పిటిషన్‌ను కొట్టివేయడంతో రిజర్వేషన్ల పంచాయితీ అగమ్యగోచరంగా మారింది. దీనితో స్థానిక ఎన్నికల పక్రియ తాత్కాలికంగా నిలిచిపోయింది. అటు ప్రభుత్వం నుంచి ఆర్డర్స్ రాకపోతే పార్టీ



పరంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని కాంగ్రెస్ అధిష్టానం ప్రకటించిన విషయం తెలిసిందే. దీనిపై విచారణ చేపట్టిన హైకోర్టు.. గురువారం సుప్రీంకోర్టు కూడా ఎన్నికలకు వెళ్లమని చెప్పింది కదా అంటూ వ్యాఖ్యానించింది. ఎన్నికలు పెట్టుకోవచ్చని ఓరల్‌గా మాత్రమే చెప్పిందని.. ఆర్డర్‌లో ఎక్కడా చెప్పలేదని ఎలక్షన్ కమిషన్ తరఫు న్యాయవాది అన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి కూడా లేఖ రాశామని కోర్టుకు తెలిపారు. బీసీ రిజర్వేషన్లలను 42 శాతానికి పెంచుతూ ఎన్నికల నోటిఫికేషన్ ఇచ్చాం కాబట్టే దాన్ని సస్పెండ్ చేశాం. మళ్లీ రిజర్వేషన్లను గూర్చి ప్రభుత్వంతో చర్చించాకే రీ నోటిఫికేషన్ ఉంటుందని పేర్కొన్నారు. రెండు వారాల సమయం కావాలని రాష్ట్ర ఎన్నికల సంఘం, రాష్ట్ర ప్రభుత్వం కోర్టును కోరడంతో తదుపరి విచారణ రెండు వారాలకు వాయిదా వేసింది.

# బీసీ బిల్లును బీజేపీ అడ్డుకుంటోంది

**మొదటిపేజీ తరువాయి**

అడ్డుకుంటోందని, ప్రధాని నరేంద్ర మోదీ సమయం ఇవ్వకపోవటంతో సీఎం రేవంత్ రెడ్డి లేఖ రాసినా ప్రయోజనం లేదని విమర్శించారు. ఈ అంశంపై అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి, కేంద్ర మంత్రులు జి. కిషన్ రెడ్డి, బండి సంజయ్, డి.కె. అరుణ, రామచంద్ర రావు చొరవ తీసుకోవాలని భట్టి కోరారు. అలాగే, ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద ధర్నా చేపట్టిన విషయాన్ని గుర్తుచేస్తూ, బీసీ సంఘాలు చేపట్టిన తెలంగాణ బంద్‌కు మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు.

**రాజకీయ కోణం**

కాంగ్రెస్ ప్రభుత్వం ఈ బిల్లును మార్చి 2025లో అసెంబ్లీలో పాస్ చేసి కేంద్రానికి పంపింది, కానీ బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం దీనిని అడ్డుకుంటోందని భట్టి ఆరోపించారు. "బీజేపీ బీసీలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తోంది" అని ఆయన ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డి కూడా ఆగస్టు 2025లో ఢిల్లీలో ధర్నా చేపట్టి, బిల్లు ఆమోదం లేకపోతే బీజేపీ బీసీ వ్యతిరేకి అని స్పష్టమవుతుందని హెచ్చరించారు. ప్రియాంకా గాంధీ కూడా ఈ బిల్లును చారిత్రాత్మకమైందని పేర్కొన్నారు. కానీ రాష్ట్రపతి ఆమోదం పెండింగ్‌లో ఉండటంతో న్యాయం ఆలస్యమవుతోందని విమర్శించారు. మరోవైపు, బీజేపీ ఈ ఆరోపణలను ఖండిస్తోంది. బీజేపీ నేతలు మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వమే బిల్లును సరిగా హ్యాండిల్ చేయలేదని, ఎన్నికల ముందు హామీలు ఇచ్చి ఇప్పుడు బీజేపీని నిందిస్తోందని అన్నారు. "కాంగ్రెస్ 2023 కామారెడ్డి డిక్లరేషన్‌లో బీసీలకు తప్పుడు హామీలు ఇచ్చింది" అని విమర్శించారు. బీజేపీ, బీఆర్ఎస్ కలిసి బీసీ రిజర్వేషన్లను అడ్డుకుంటున్నాయని మంత్రి జూపల్లి కృష్ణారావు ఆరోపించారు. ఈ రాజకీయ ఆరోపణలు ఓటు బ్యాంక్ పాలిటిక్స్‌గా మారాయి, ఎందుకంటే బీసీలు తెలంగాణలో ప్రధాన ఓటర్ బేస్.

**బీఆర్ఎస్, ఇతర పార్టీల కోణం**

బీఆర్ఎస్ నేతలు కూడా కాంగ్రెస్‌ను విమర్శిస్తున్నారు. ప్రభుత్వం బిల్లును సరిగా హ్యాండిల్ చేయలేదని, ఇప్పుడు సుప్రీం కోర్ట్‌కు వెళ్లాలని సూచించారు. "కాంగ్రెస్ బీసీలకు న్యాయం చేయడంలో నిజాయితీ లేదు" అని అన్నారు. కేటీఆర్ కూడా కాంగ్రెస్ క్యాస్ట్ సెన్సస్‌ను "క్రూయల్ జోక్" అని విమర్శించారు, 50% పైన రిజర్వేషన్లకు రాజ్యాంగ సవరణ అవసరమని చెప్పారు. బీఆర్ఎస్ గతంలో 34% బీసీ రిజర్వేషన్ ఇచ్చిందని, కానీ కాంగ్రెస్ వారు కోర్టులో అడ్డుకున్నారని కేటీఆర్ ఆరోపించారు. ఈ విమర్శలు రాష్ట్రంలో రాజకీయ పోటీని ప్రతిబింబిస్తున్నాయి, ఎందుకంటే బీఆర్ఎస్ కూడా బీసీలను ఆకర్షించాలని కోరుకుంటోంది.



**కోర్టు ఆర్డర్లు మరియు అడ్డంకులు**

న్యాయపరంగా, తెలంగాణ హైకోర్టు సెప్టెంబర్ 26, 2025న ఇచ్చిన జీవోపై స్టే ఇచ్చింది, 42% బీసీ కోటాను అడ్డుకుంది. ప్రభుత్వం సుప్రీం కోర్ట్‌కు వెళ్లింది, కానీ అక్టోబర్ 16, 2025న సుప్రీం కోర్టు దానిని తిరస్కరించి, ఎన్నికలు ఇప్పటికే ఉన్న రిజర్వేషన్లతో నిర్వహించవచ్చని చెప్పింది. ఇది ప్రభుత్వానికి ఎదురుదెబ్బగా మారింది. భట్టి విక్రమార్క ఈ స్టే పై విమర్శిస్తూ, రాజకీయంగా, న్యాయపరంగా పోరాడతామని చెప్పారు. ఈ ఆర్డర్లు 50% రిజర్వేషన్ క్యాప్ (ఇంద్రా సాహ్నీ కేసు)ను గుర్తుచేస్తున్నాయి, దీనికి క్యాస్ట్ సర్వే డేటా మరియు రాజ్యాంగ సవరణ అవసరం.

**సామాజిక, ఆర్థిక కోణం**

బీసీ సంఘాలు ఈ అంశంపై ఆందోళనలు చేపట్టాయి. బీసీ నేతలు రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేసి నిరసన తెలిపారు, ఆర్డినెన్స్‌కు లీగల్ సాంక్షన్ లేదని విమర్శించారు. అక్టోబర్ 18, 2025న తెలంగాణ బంద్ చేపట్టారు, దీనికి కాంగ్రెస్ మద్దతు ఇచ్చింది. ఇది బీసీలకు సామాజిక న్యాయం అవసరమని చూపిస్తుంది, కానీ ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు ఉపయోగపడుతుంది. మరోవైపు, జనరల్ కేటగిరీ నుండి విమర్శలు ఉన్నాయి. హైకోర్టు స్టేను "మెరిట్ విక్టరీ"గా చూస్తున్నారు, 73% పాపులేషన్ రిజర్వేషన్‌పై ఆధారపడటం దేశాన్ని వెనుకబరచుతుందని అంటున్నారు. ఇది రిజర్వేషన్ వ్యవస్థపై విస్తృత చర్చను రేకెత్తిస్తోంది, మెరిట్ vs సామాజిక న్యాయం మధ్య సంఘర్షణను హైలైట్ చేస్తోంది.

**ఈ పరిణామాలు ఎక్కడికి దారి తీస్తాయి?**

ఈ ఇష్యూ రాజకీయంగా కాంగ్రెస్‌కు లాభం చేస్తుందా లేదా బూమరాంగ్ అవుతుందా అనేది చూడాలి. భాజపా మరియు బీఆర్ఎస్ విమర్శలు ప్రభుత్వం అసమర్థతను చూపిస్తున్నాయి, అయితే బీసీల మద్దతు కాంగ్రెస్‌కు బలం. న్యాయపరంగా, సుప్రీం కోర్టు నిర్ణయం తర్వాత ప్రభుత్వం మరిన్ని చర్యలు తీసుకోవాలి, లేదంటే లోకల్ బాడీ ఎన్నికలు ఇప్పటికే ఉన్న 23% కోటాతో జరగవచ్చు. సామాజికంగా, ఇది క్యాస్ట్ పాలిటిక్స్‌ను పెంచుతుంది, కానీ దీర్ఘకాలంలో రాజ్యాంగ సవరణ లేకుండా 42% సాధ్యం కాదు. అన్ని పార్టీలు బీసీలకు న్యాయం చేయాలని కోరుకుంటున్నట్లు కనిపిస్తున్నా, అమలు అడ్డంకులు రాజకీయ డ్రామాను కొనసాగిస్తాయి.



# ఆ అబద్ధపు కథ కాంగ్రెస్ ఎంఐఎం ప్రచారంలో మాత్రమే ఉంది..

**తెలంగాణ బ్యూరో, సిద్దిపేట పవర్ :**

కేంద్ర మంత్రి బండి సంజయ్ కాంగ్రెస్, ఎంఐఎంలపై సంచలన వ్యాఖ్యలు చేశారు. భాగ్యనగర్ వీధులు కాంగ్రెస్, ఎంఐఎం ఎంతగా దిగజారిన రాజకీయం చేస్తున్నాయో సాక్ష్యం చెబుతున్నాయన్నారు. బీజేపీ & ఎంఐఎం ఒక్కటే అని రాహుల్ గాంధీ ప్రచారం చేసుకుంటూ తిరిగారు - కానీ జూబ్లీహిల్స్‌లో, ఒవైసీ బహిరంగంగా కాంగ్రెస్‌కు మద్దతు ప్రకటిస్తున్నారని విమర్శించారు. రాహుల్ గాంధీకి ఒక్కసారిగా అభ్యంతరం లేకుండా పోయిందా? ఇది డొల్లతనం కాకపోతే మరేమిటి? అని ప్రశ్నించారు.

బీఆర్ఎస్ - బీజేపీ పొత్తు అనేది లేదు. ఆ అబద్ధపు కథ కాంగ్రెస్ - ఎంఐఎం ప్రచారంలో మాత్రమే ఉందన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలలో అసలు సెట్టింగ్ ఏంటంటే, కాంగ్రెస్ ఒవైసీ ఒడిలో హాయిగా కూర్చోవడమని తెలిపారు. బీజేపీ ఒంటరిగా పోటీ చేస్తోంది. ఎంఐఎం కనీసం అభ్యర్థిని నిలబెట్టడానికి కూడా సాహసించలేదు. పెద్ద ఒవైసీ కాంగ్రెస్‌కు ఆదేశాలు ఇస్తారు. చిన్న ఒవైసీ బీఆర్ఎస్‌కు సందేశాలు చేరవేస్తారని మండిపడ్డారు. కాంగ్రెస్ & బీఆర్ఎస్ కొట్లాడుతున్నట్లు నటించవచ్చు, కానీ బీజేపీని ఆపడానికి ఇద్దరూ ఎంఐఎం నుండి రాజకీయ పాఠాలు నేర్చుకుంటున్నారని అన్నారు. మీరు ఎన్ని తెరవెనుక ఒప్పందాలు చేసుకున్నా సరే - బీజేపీ మీ కళ్ల ముందే ఆ స్థానాన్ని గెలుచుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ ఓటర్లు బ్యాలెట్ ద్వారా సమాధానం చెబుతారని బండి సంజయ్ అన్నారు.

# సామాన్యుడికి లాభం చేకూర్చని పరిశోధన నిష్ఫలం

- సుల్తాన్‌పూర్ మెడికల్ డివైసెస్ పార్క్‌లో హ్యూవెల్ కొత్త కెమిస్ట్రీ ల్యాబ్ ప్రారంభం
- ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- కోవిడ్ సమయంలో టెస్ట్ ధరను భారీగా తగ్గించిన హ్యూవెల్‌ను అభినందించిన కేటీఆర్



తెలంగాణ బ్యూరో, సిద్దిపేట పవర్ :

సామాన్యుడికి ఉపయోగపడని సాంకేతికత, పరిశోధనల వల్ల ప్రయోజనం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కోవిడ్ మహమ్మారి సమయంలో రూ.6,000 ఖర్చయ్యే ఆర్టీపీసీఆర్ టెస్టును కేవలం రూ.12కే అందుబాటులోకి తెచ్చిన హ్యూవెల్ (Huwel) సంస్థ కృషి అద్భుతమని ఆయన కొనియాడారు. తెలంగాణలోని సుల్తాన్‌పూర్ మెడికల్ డివైసెస్ పార్క్‌లో హ్యూవెల్ ఏర్పాటు చేసిన నూతన కెమిస్ట్రీ ల్యాబ్‌ను కేటీఆర్ ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "దేశంలో వినియోగించే వైద్య పరికరాల్లో దాదాపు 70 నుంచి 80 శాతం విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నాం. ఈ పరిస్థితిని మార్చి, మన దేశంలోనే తక్కువ ధరకు నాణ్యమైన పరికరాలను ఉత్పత్తి చేయాలనే గొప్ప సంకల్పంతో కేసీఆర్ గారి హయాంలో ఈ మెడికల్ డివైసెస్ పార్క్‌ను ఏర్పాటు చేశాం" అని తెలిపారు. దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించి, వైద్య ఖర్చులను సామాన్యులకు అందుబాటులోకి తీసుకురావడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆయన వివరించారు.

ఒకప్పుడు రాళ్లు, క్రషర్లతో నిండిన సుల్తాన్‌పూర్ ప్రాంతం నేడు వేలాది మందికి ఉపాధి కల్పించే పారిశ్రామిక కేంద్రంగా మారడం ఎంతో సంతోషాన్నిస్తోందని కేటీఆర్ అన్నారు. కోవిడ్ కష్టకాలంలో టెస్టింగ్ కిట్లకు తీవ్రమైన కొరత, అధిక డిమాండ్ ఉండేదని గుర్తుచేశారు. అలాంటి క్లిష్ట పరిస్థితుల్లో పోర్టబుల్ ఆర్టీపీసీఆర్ కిట్ల వంటి ఆవిష్కరణలతో ప్రజలకు మేలు చేసిన హ్యూవెల్ యాజమాన్యం, శిశిర్, రచన బృందాన్ని ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

"సామాన్యుడికి ఫలాలు అందించని పరిశోధన వ్యర్థమని కేసీఆర్ గారు మాకు ఎప్పుడూ చెబుతుంటారు. ఆ మాటలను నిజం చేస్తూ హ్యూవెల్ పనిచేస్తోంది" అని అన్నారు. సంస్థ పదవ వార్షికోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు తెలిపిన కేటీఆర్, "ఇంకో రెండేళ్లలో మేం అధికారంలోకి వస్తాం. వచ్చిన తర్వాత పరిశ్రమలకు మరింత అండగా నిలుస్తాం" అని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో శాంత బయోటెక్ ఎండీ వరప్రసాద్ రెడ్డి, హ్యూవెల్ సంస్థ ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పిల్లికోటల్ గ్రామం లో కమ్యూనిటీ భవనం మరియు వైకుంట దామం కి స్థలం కేటాయించాలి

మెదక్ జిల్లా అక్టోబర్ 17(సిద్దిపేట పవర్ ):

మెదక్ పట్టణ మునిసిపల్ పరిధిలోని 12వ వార్డు పిల్లికోటల్ గ్రామం లో కమ్యూనిటీ భవనం మరియు వైకుంట దామం కి స్థల కేటాయింపు, చేయాలని శుక్రవారం రోజు నా స్థానిక ఎమ్మెల్యే, మరియు మెదక్ ఎం.ఆర్.ఓ, కు ఫిర్యాదు చేయడం జరిగింది.ప్రస్తుతం సర్వే నెంబర్ 1089,1090,లో గల్ల నెంబర్ లో రెండు ఎకరాల ప్రభుత్వ భూమిని మెదక్ పట్టణ పరిధిలోని 12వ వార్డులోని పిల్లికోటల్ గ్రామం గత 40 సంవత్సరాలుగా చిట్యాల గ్రామ పంచాయతీ పరిదిలో ఉండేది. గత సంవత్సరాలుగా ప్రస్తుతం మేము మున్సిపాలిటీ పరిదిలోకి మారడం జరిగినది. కానీ ఆ యొక్క గ్రాములో ఒక కమ్యూనిటీ భవనం మరియు వైకుంఠధామం కావాలనీ అధికారుల చుట్టూ తిరిగాము. కానీ మా గ్రామ పరిదిలో ఇటీవల కాలంలో మెదక్ పట్టణం లోని నవపేట కుర్మ సంఘ జిల్లా భవనం కోసం స్థానిక మెదక్ తహశీల్దారు స్థలం కేటాయించారు. ఈ కుర్మ సంఘానికి కేటాయించినటువంటి భూమిని తక్షణమే రద్దుచేసి గతంలో మాకు హామీ ఇచ్చినట్టుగా కేటాయించాలని డిమాండ్ చేస్తున్నాం. ఈ విషయం మా యొక్క గ్రామ ప్రజల మనోభావాలను కించపరిచేవిధంగా ఉందని తెలియడానికి చింతిస్తున్నాం. ఎందుకనగా గత 30 సంవత్సరాలుగా మా గ్రామానికి ఒక కమ్యూనిటీ భవనం మరియు వైకుంట దామం కావాలని అందరి నాయకుల చుట్టూ తిరిగిన అది కేవలం ప్రదక్షణాల పరిమితమైంది కానీ ప్రస్తుతం త 30 సంవత్సారలుగా ఏదురు చూస్తున్న మమ్మల్ని మా గ్రామ ప్రజల కలల్ని కించపరిచే విధంగా నిర్ణయం తీస్కోవడం మా గ్రామ ప్రజలను తీవ్ర కలవరపెడుతుంది. ఇప్పడి వరకు మా గ్రామ పరిదిలోని సుమారు 200 ల ఎకరాల ప్రభుత్వ భూమిని ప్రభుత్వం డబుల్ బెడ్రూం, మరియు ప్రభుత్వ ఎం.సి.ఎచ్. మరియు మెడికల్ కోసం కేటాయించారు. అయిన మాకు ఎలాంటి అభ్యంతరం లేదు, కానీ అప్పటివరకు మా యొక్క గ్రామ అభివృద్ధి అవసరాల కోసం ఒక గుంట స్థలం కూడా కేటాయించలేదు. అందువలన మా యొక్క గ్రామ ప్రజల మనోభావాలని పర్యవేక్షణలోకి తీస్కోని మా గ్రామంలో కమ్యూనిటీభవనం, వైకుంటా దామంనికి స్థల సేకరణ చేసి మా గ్రామ అభివృద్ధికి తోడ్పడతారని ఆశిస్తున్నాం. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మెదక్ జిల్లా నాయకులు అస్త్ర గళ్ళ బాలరాజ్ ఈ శ్రీనివాస్ నాగరాజు రాజు రమేష్ ప్రభాకర్ నర్సింలు ప్రవీణ్ శేఖర్ రాములు మరియు తదితరులు పాల్గొన్నారు.



# బీసీ వర్గాల హక్కుల సాధన కోసం రాష్ట్ర బంద్ కు జెఎసి కన్వీనర్ కొప్పెరి వెంకట హరిహర కిషన్

సంగారెడ్డి జిల్లా అక్టోబర్ 17(సిద్దిపేట పవర్):



బీసీ వర్గాల హక్కుల సాధన కోసం శనివారం చేపట్టిన రాష్ట్రవ్యాప్త బంద్‌కు అన్ని రాజకీయ పార్టీలు మద్దతుతొ జిల్లా ప్రజలు బంద్ ను విజయవంతం చేయాలని సంగారెడ్డి జిల్లా బీసీ కుల సంఘాల జెఎసి కన్వినర్ కొప్పెరి వెంకట హరి హర కిషన్ పిలుపునిచ్చారు. 42 శాతం బీసీ రిజర్వేషన్ అమలు కోసం రాష్ట్రవ్యాప్త బంద్ ఒక శాంతియుత నిరసన రూపమని, బంద్ ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. బీసీల శ్రేయస్సు కోసం పోరాటం 42% రిజర్వేషన్లు సాధించేవరకు కొనసాగుతుందని, ఇది సమాజ అభివృద్ధి కోసం ఒక ఆవశ్యక దశ అని పేర్కొన్నారు. ప్రజలు, వ్యాపారవేత్తలు, విద్యార్థులు, అన్ని బీసీ కుల సంఘాలు స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొని బీసీ సమాజ ఐక్యతను చాటాలన్నారు. బీసీల సమస్యలు పరిష్కారమయ్యే వరకు ఈ ఉద్యమం నిరాటానకంగా సాగుతుందన్నారు.

# కొండా సురేఖ పదవికి గండం?



మొదటిపేజీ తరువాయి

అవినీతి ఆరోపణలు - ఇవన్నీ ఆమె పదవికి ముప్పుగా మారుతున్నాయా? వరంగల్ జిల్లా కాంగ్రెస్ నేతలందరూ ఆమెకు వ్యతిరేకంగా ఉన్నట్టు కనిపిస్తోంది. బస్వరాజ్ సారయ్య, కడియం శ్రీహరి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వంటి కీలక నేతలతో విభేదాలు మరింత ముదిరాయి. ఈ నేపథ్యంలో ఆమె రాజకీయ భవిష్యత్తు ఏమిటన్న చర్చ రాష్ట్ర రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతోంది.కొండా సురేఖ గతంలోనూ అనేక సందర్భాల్లో వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఇటీవల సినీ నటులు నాగార్జున కుటుంబంపై ఆమె చేసిన వ్యాఖ్యలు భారీ వివాదానికి దారితీశాయి. ఆమెపై డిఫమేషన్ కేసులు నమోదయ్యాయి, టాలీవుడ్ మొత్తం ఆమెకు వ్యతిరేకంగా నిలిచింది. అంతకుముందు బీఆర్ఎస్ నేత కేటీఆర్‌పై కూడా ఆమె వ్యక్తిగత వ్యాఖ్యలు చేసి వివాదాన్ని రేపారు. ఇలాంటి సంఘటనలు ఆమెను సొంత పార్టీలోనూ వివాదాస్పద వ్యక్తిగా ముద్రవేశాయి. తాజా వివాదం ఓఎస్డీ ఎన్. సుమంత్ చుట్టూ తిరుగుతోంది. డెక్కన్ సిమెంట్స్ వివాదంలో సుమంత్‌పై అవినీతి, బెదిరింపు ఆరోపణలు వచ్చాయి. ఆమె నివాసంలో పోలీసులు సోదాలు చేపట్టారు, సుమంత్‌ను అరెస్ట్ చేయడానికి ప్రయత్నించారు. దీనిపై సురేఖ కుమార్తె సుస్మిత పటేల్ సంచలన ఆరోపణలు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వేం నరేందర్ రెడ్డి, రోహిన్ రెడ్డి కలిసి తమ కుటుంబంపై కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. "అసలు గన్ ఇచ్చింది రేవంత్ రెడ్డే. రోహిన్ రెడ్డి దాన్ని ఉపయోగించి డెక్కన్ సిమెంట్స్‌ను బెదిరించాడు. ఇప్పుడు ఆ బాధ్యత మా మనిషి సుమంత్ మీదకు తోసి, మా అమ్మను పదవి నుంచి తప్పించాలని చూస్తున్నారు" అని సుస్మిత విరుచుకుపడ్డారు. ఈ ప్రభుత్వంలో రెడ్డి నేతలు బీసీలను తొక్కేస్తున్నారని, తమ కుటుంబం బీసీ సామాజిక వర్గానికి చెందినందునే లక్ష్యంగా చేసుకున్నారని ఆరోపించారు.


సురేఖ వాదన: ఈ ఆరోపణలన్నీ తనను రాజకీయంగా దెబ్బతీయడానికి రెడ్డి లాబీ చేస్తున్న కుట్ర అని సురేఖ వాదిస్తున్నారు. మేడారం జాతర టెండర్ల వివాదంలో తనను లక్ష్యంగా చేసుకున్నారని, ఇతర బీసీ నేతల నుంచి తనకు మద్దతు ఉందని చెబుతున్నారు. తన ఓఎస్డీని తనకు తెలియకుండానే తొలగించారని, పోలీసులను తన ఇంటికి పంపి మర్డర్ అటెంప్ట్ చేశారని ఆమె కుటుంబం ఆరోపిస్తోంది. రాహుల్ గాంధీని జోక్యం చేసుకోవాలని కోరుతూ, సొంత పార్టీలో సామాజిక న్యాయం లేదని వాదిస్తున్నారు.

ఆమె వ్యతిరేకుల వాదన: మరోవైపు, సురేఖ వ్యతిరేకులు - ముఖ్యంగా రెడ్డి నేతలు - ఓఎస్డీ సుమంత్ అవినీతి, బెదిరింపులకు పాల్పడ్డాడని, అందుకే చర్యలు తీసుకున్నామని వాదిస్తున్నారు. డెక్కన్ సిమెంట్స్ వివాదంలో సుమంత్ మధ్యవర్తిగా పనిచేశాడని ఆరోపణలు ఉన్నాయి. వరంగల్ జిల్లా నేతలు కడియం శ్రీహరి, పొంగులేటి వంటి వారు సురేఖతో విభేదాలు పెట్టుకున్నారు. ఆమె వరంగల్ రాజకీయాల్లో ఆధిపత్యం చెలాయిస్తుందని, సీఎం జోక్యాన్ని కూడా సహించదని విమర్శలు ఉన్నాయి. పార్టీ హైకమాండ్ ఆమెను మీడియాతో మాట్లాడవద్దని ఆదేశించింది, క్యాబినెట్ సమావేశాన్ని స్కిప్ చేసినందుకు విమర్శలు వచ్చాయి. విపక్షాలు బీఆర్ఎస్, బీజేపీ ఈ గొడవలను విమర్శిస్తూ, కాంగ్రెస్‌లో అవినీతి, గ్రూప్ పాలిటిక్స్ ఉందని ఆరోపిస్తున్నాయి.

ఈ వివాదాలు తెలంగాణ కాంగ్రెస్‌లో బీసీరెడ్డి మధ్య వర్గ విభేదాలను మరింత తీవ్రతరం చేశాయి. సురేఖ పదవికి ముప్పు ఉందా? హైకమాండ్ జోక్యంతో సర్దుబాటు అవుతుందా? అన్నది చూడాలి. ప్రస్తుతం ఆమె రాజకీయ భవిష్యత్తు అనిశ్చితంగానే కనిపిస్తోంది, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలు దీన్ని మరింత ప్రభావితం చేసే అవకాశం ఉంది.

# రేవంత్ రెడ్డి గన్ కల్చర్ తీసుకువచ్చారు..

- కాంగ్రెస్ నాయకులు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపణ
- కేటీఆర్ వర్షం పడుతుంటే గుర్నానీకి గొడుకు పట్టి పెట్టుబడులను ఆహ్వానించారని వ్యాఖ్య
- ఏం సాధించారని ప్రజా విజయోత్సవాలు నిర్వహిస్తున్నారని నిలదీత



తెలంగాణ బ్యూరో, సిద్దిపేట పవర్ :

తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గన్ కల్చర్‌ను ప్రోత్సహిస్తున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. కాంగ్రెస్ నాయకులు తుపాకులు చూపి వ్యాపారవేత్తలను బెదిరించి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు. గతంలో కేటీఆర్ వర్షంలో సైతం టెక్ మహీంద్ర సీఈవో గుర్నానీకి గొడుగు పట్టి పెట్టుబడులను ఆహ్వానించిన చరిత్ర తమదని గుర్తు చేశారు. తెలంగాణలో పెట్టుబడులు తగ్గిపోయాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

ఈరోజు మీడియాతో మాట్లాడుతూ, డిసెంబర్ 1 నుంచి 9 వరకు ప్రభుత్వ విజయోత్సవాలు నిర్వహిస్తామని కాంగ్రెస్ చెబుతోందని, అయితే తుపాకులు పెట్టి అక్రమ వసూళ్లకు పాల్పడినందుకు ఈ ఉత్సవాలు చేస్తున్నారా అని హరీశ్ రావు ప్రశ్నించారు. కాంట్రాక్టుల కోసం మంత్రివర్గ సమావేశంలో మంత్రులు కొట్లాడుకుంటున్నారని, వారి మధ్య తగాదాలు పెరిగి రోజూ వీధిన పడి పరువు తీస్తున్నందుకు విజయోత్సవాలు జరుపుకుంటున్నారా అని ఆయన ధ్వజమెత్తారు. ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని, ప్రాజెక్టులు కట్టలేదని, పైగా ఉన్న పథకాలను రద్దు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. అందుకే విజయోత్సవాలు జరుపుకుంటున్నారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెట్టుబడిదారులకు, పారిశ్రామికవేత్తలకు, సినీ పరిశ్రమ పెద్దలకు, రియల్ ఎస్టేట్ వ్యాపారులకు, పేదలకు ప్రధాన ప్రతిపక్షంగా బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు. తెలంగాణను సాధించి, పదేళ్లు అద్భుతంగా పాలించిన తమ పార్టీకి రాష్ట్రాన్ని కాపాడుకునే బాధ్యత ఉందని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ భవన్ తలుపులు ప్రతి ఒక్కరికీ తెరిచే ఉంటాయని ఆయన అన్నారు. డీజీపీ శివధర్ రెడ్డి ఖాకీ బుక్‌లో మంత్రులకు ప్రత్యేక నిబంధనలు ఉన్నాయా అని హరీశ్ రావు ప్రశ్నించారు. తెలంగాణలో పింక్ బుక్, రెడ్ బుక్, బ్లూ బుక్ లేవని డీజీపీ ఇటీవల చెప్పారని, కానీ స్వయంగా మంత్రి కుటుంబ సభ్యులే ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నారని ఆయన అన్నారు. సామాజిక మాధ్యమాల్లో రీట్వీట్ చేస్తేనే రాత్రికి రాత్రి అరెస్టు చేస్తున్నారని విమర్శించారు. కొంతమంది తుపాకులు పట్టుకుని తిరుగుతుంటే డీజీపీకి కనిపించడం లేదా అని నిలదీశారు.తెలంగాణలో మంత్రుల పంచాయితులను పరిష్కరించేందుకు మంత్రి వర్గ సమావేశాలు నిర్వహిస్తున్నారని హరీశ్ రావు ఎద్దేవా చేశారు. కమీషన్ కోసం ఒకరు, కాంట్రాక్టుల కోసం మరొకరు, వాటాల కోసం మరొకరు, అక్రమ వసూళ్ల కోసం, కబ్జాల కోసం మంత్రులు వర్గాలుగా విడిపోయారని ఆయన ఆరోపించారు. మంత్రివర్గ సమావేశం దండుపాళ్యం ముఠాలా మారిపోయిందని ఆయన విమర్శించారు. గత కొన్ని రోజులుగా మంత్రుల మధ్య తగాదాలే చూస్తున్నామని, పాలన గాలికి వదిలేశారని ఆయన అన్నారు.

# సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం:ఎమ్మార్పీఎస్

మెదక్ జిల్లా అక్టోబర్ 17(సిద్దిపేట పవర్):




పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశానుసారం తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాలలో నిరసన మరియు ఎం.ఆర్.ఓ, కి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఎమ్మార్పీఎస్ మెదక్ జిల్లా నాయకులు మలిశెట్టి రవి మాదిగ మాట్లాడుతూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సిజెఐ గవాయి పై జరిగిన దాడిని ఖండిస్తూ నిరసన వ్యక్తం చేయడం జరిగింది. దాంట్లో భాగంగానే శుక్రవారం హావేళ్ళి ఘణపూర్ ఎమ్మార్వో కార్యాలయం వద్ద నల్ల జెండాలతో నిరసన వ్యక్తం చేస్తూ దాడి వెనుక ఉన్న వ్యక్తులను గుర్తించి శిక్ష పడేలా చెయ్యాలి. అదే విధంగా ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ హావేళ్ళి ఘణపూర్ మండలం అధ్యక్షులు మాద్గి సంజీవులు మాదిగ, ఎం.ఎస్.ఎపై. నాయకులు కందరం రాజు మాదిగ, రాజయ్య మాదిగ, వి.హెచ్.పి.ఎస్, అనుబంధ సంఘాల నాయకులు అర్క మాణిక్యం, మనే సాయిబాబా, జావాజి సిద్దిరాములు పాల్గొని దళితుల మీద జరుగుతున్న దాడులను వ్యతిరేకించాలని తెలియజేస్తూ ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మెదక్ జిల్లా నాయకులు మలిశెట్టి రవి మాదిగ, హావేళ్ళి ఘణపూర్ మండలం అధ్యక్షులు మాద్గి సంజీవులు మాదిగ, ఎం.ఎస్.ఎఫ్. నాయకులు కందరం రాజు మాదిగ, వి.హెచ్.పి.ఎస్, నాయకులు అర్క మాణిక్యం మరియు ఎమ్మార్పీఎస్ నాయకులు వి.హెచ్.పి.ఎస్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సమస్యలు సహజమే..

- అవి టీ కప్పులో తుఫాన్ లాంటివి
- ఏఐసీసీ, పీసీసీ ఇన్‌ఛార్జ్‌లు చూసుకుంటారు
- బీసీ రిజర్వేషన్‌పై పోరాటం ఆగదు
- ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి



తెలంగాణ బ్యూరో, సిద్దిపేట పవర్ :

కాంగ్రెస్ పార్టీలో చిన్న సమస్యలు ఉండటం సహజమేనని, అవి టీ కప్పులో తుఫాన్ లాంటివని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కొండా సురేఖ అంశంపై ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, పీసీసీ ప్రెసిడెంట్ చర్చిస్తున్నారన్నారు.

కాంగ్రెస్ పార్టీలో స్వాతంత్రం ఉంటుందని, అందుకే అప్పుడప్పుడు సమస్యలు వచ్చి సర్దుమనుగుతాయన్నారు. కాంగ్రెస్ పార్టీలో నియంత పాలన ఉండదన్నారు. ఇక బీసీ బంద్‌కు కాంగ్రెస్ సంపూర్ణంగా మద్దతిస్తుందన్నారు. కాంగ్రెస్ చిత్తశుద్ధితో ఉన్నదని, రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర సందర్భంగా దేశంలో జన గణనలో, కుల గణన జరగాలని కోరారన్నారు. కాంగ్రెస్ పార్టీ డెడికేషన్ కమిషన్ పెట్టి శాస్త్రీయ పద్ధతిలో కుల గణన చేసిందన్నారు. స్థానిక సంస్థల 42 శాతం రిజర్వేషన్ ఇచ్చేందుకు సుప్రీంకోర్టులో స్పెషల్ పిటిషన్ వేయగా, డిస్మిస్ అయిందన్నారు. అందుకే అన్ని పొలిటికల్ పార్టీలతో ఆర్ కృష్ణయ్య, జాజుల శ్రీనివాస్ గౌడ్ నేతృత్వంలో పోరాటం కొనసాగుతుందన్నారు. ఆర్ కృష్ణయ్యపై గురుత్వర బాధ్యత ఉన్నదన్నారు. బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు, కిషన్ రెడ్డి, బండి సంజయ్ ఢిల్లీకి తీసుకొచ్చి బీసీ రిజర్వేషన్ బిల్లుపై ప్రధానితో చర్చించాల్సిన అవసరం ఉన్నదన్నారు.

ఇక ఒంగోలు పార్లమెంట్ సభ్యుడు మాగుంట శ్రీనివాసులు రెడ్డి అధ్యక్షతన జరిగిన పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ (హౌసింగ్ అండ్ అర్బన్ అఫైర్స్) సమావేశంలో చామల కిరణ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సమావేశంలో చామల మాట్లాడుతూ, దేశంలో ప్రస్తుతం పెరుగుతున్న పట్టణీకరణ, దేశవ్యాప్తంగా జరుగుతున్న వేగవంతమైన భౌగోళిక, ఆర్థిక మార్పులను పూర్తిగా ప్రతిబింబించ లేకపోతున్నదన్నారు. అందువల్ల, జనగణన ప్రమాణాల పునఃసమీక్ష కేవలం గణాంక పరమైన అవసరం మాత్రమే కాకుండా, ఆధునిక వాస్తవాలను ప్రతిబింబించేలా ఉండాలని అది పాలనాపరమైన ఆవశ్యకత అని కూడా కమిటీ సభ్యులు చర్చించినట్టు తెలిపారు.

# పేదలకు మెరుగైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యం..

- విద్యాశాఖ ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష
- పేదలకు మెరుగైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యం



తెలంగాణ బ్యూరో, సిద్దిపేట పవర్ :

విద్యాశాఖ ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. పేదలకు మెరుగైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతుల కల్పనకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. తొలి దశలో ఔటర్ రింగురోడ్డు లోపల ఉన్న కోర్ అర్బన్ రీజియన్ పై దృష్టి సారించాలని సూచించారు. ప్రతీ ప్రభుత్వ పాఠశాల కార్పొరేట్ స్కూల్ తరహాలో తీర్చిదిద్దాలన్నారు.

ప్లే గ్రౌండ్, అవసరమైన తరగతి గదులతోపాటు మంచి వాతావరణం ఉండేలా చూడాలని తెలిపారు. ఇందుకు విద్యా శాఖ పరిధిలో ఉన్న స్థలాలను గుర్తించాలని అధికారులను ఆదేశించారు. సరైన సౌకర్యాలు లేని పాఠశాలలను దగ్గరలో అందుబాటులో ఉన్న ప్రభుత్వ స్థలానికి తరలించాలన్నారు. నర్సరీ నుంచి 4 వ తరగతి వరకు నూతన స్కూల్స్ ను పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించాలన్నారు. అక్కడ కార్పొరేట్ స్కూల్ స్థాయిలో అన్ని వసతులతో విద్యను అందించే ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు పాలు, బ్రేక్ ఫాస్ట్, లంచ్ అందించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు తెలిపారు. 2026 జూన్ లో అకడమిక్ ఇయర్ నుంచి అమలు జరిగేలా యాక్షన్ ప్లాన్ తో ముందుకెళ్లాలని సీఎం రేవంత్ సూచించారు.



# సిపిఎం నాయకుల అరెస్టుతో బీసీ రిజర్వేషన్లను అడ్డుకోలేరు


**చేర్యాల, అక్టోబర్ 17 (సిద్దిపేట పవర్)**

కేంద్ర ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ల అమలుపై అనుసరిస్తున్న విధానానికి వ్యతిరేకంగా సిపిఎం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో రాజ్ భవన్ ముట్టడికి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భాగంగా రాజ్ భవన్ ముట్టడికి బయలుదేరుతున్న సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఆలేటి యాదగిరి, సిపిఎం మండల కార్యదర్శి ఎండి షఫీ, సిపిఎం మండల నాయకులు పిట్టల నరేష్, నారదాసు కనకయ్య, వేల్పుల విజయ్ కుమార్, లను పోలీసులు ముందస్తు అరెస్టులు చేశారు. ఈ సందర్భంగా ఆలేటి యాదగిరి మాట్లాడుతూ.. బీసీ రిజర్వేషన్ల అమలుపై కేంద్ర ప్రభుత్వం రెండు నాలుకల ధోరణి అవలంబిస్తుందని ఆయన మండిపడ్డారు. బిజెపి పార్టీ రాష్ట్రంలో ఒక పాట కేంద్రంలో ఒక పాట పాడుతూ బీసీ ప్రజలను మోసం చేస్తున్నారని ఆయన అన్నారు. బీసీ రిజర్వేషన్లు కేంద్రం మెడలు వంచైన రిజర్వేషన్లు సాధిస్తామని ఆయన తెలిపారు.

# BC లకు 42శాతం రిజర్వేషన్ ఇవ్వాల్సిందే

- **18న బీసీ జేఏసీ బంద్ కు వ్యాపారస్తులు సంపూర్ణ మద్దతు తెలపాలి**
- **బీసీ నాయకులు శివగారి అంజయ్య**

**చేర్యాల, అక్టోబర్ 17 (సిద్దిపేట పవర్)**



ఈనెల 18 నాడు బీసీ జేఏసీ ఆధ్వర్యంలో, బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 42శాతం రిజర్వేషన్ల సాధనకై 18న బీసీల జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న బీసీల బంద్ కార్యక్రమానికి సంపూర్ణ మద్దతు తెలపాలి అని బి.సీ నాయకులు శివగారి అంజయ్య అన్నారు..ఈ సందర్భంగా శివగారి అంజయ్య మాట్లాడుతూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్ దక్కేల అందరూ ఐక్యతతో ముందుకు రావాలని దేశంలో, రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా, అభివృద్ధి చెందినప్పుడే అది సంపూర్ణ అభివృద్ధి అంటారు అని పేర్కొన్నారు..అదే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం చట్ట బద్దంగా 42% రిజర్వేషన్ ఇవ్వాలి అని, అలా కాకుండా పార్టీ పరంగా రిజర్వేషన్ లు ఇస్తే భవిష్యత్తులో కూడా మళ్ళీ ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుంది అని, ఈ రిజర్వేషన్ లు ఎన్నికల్లో మాత్రమే కాకుండా విద్య, ఉపాధి, ఉద్యోగ విషయాల్లో కూడా వర్తింపచేయాలి అని శివగారి అంజయ్య ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు..

# సాక్షి ఎడిటర్‌పై అక్రమ కేసులకు నిరసన

- **పత్రికా స్వేచ్ఛను అడ్డుకోవడం సరికాదు**
- **సాక్షి ఎడిటర్‌పై దాడులను ఖండిస్తున్నాం**
- **టీయుడబ్ల్యూజే (ఐజేయు) జిల్లా అధ్యక్షుడు కలకుంట్ల రంగాచారి**
- **సిద్దిపేటలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపిన జర్నలిస్టులు**

**సిద్దిపేట పవర్ ప్రతినిది:**

పత్రికా స్వేచ్ఛను అడ్డుకోవడం సరికాదని, సాక్షి పత్రిక ఎడిటర్ ధనుంజయ్‌రెడ్డి పై అక్రమ కేసులు నమోదు చేయడాన్ని ఖండిస్తున్నామని టీయుడబ్లుయజే (ఐజేయు) జిల్లా అధ్యక్షుడు కలకుంట్ల రంగాచారి తెలిపారు. సాక్షి ఎడిటర్‌పై ఏపి ప్రభుత్వం అక్రమ కేసులు, విచారణ పేరుతో నిర్బంధ కాండకు వ్యతిరేకంగా సిద్దిపేట అంబేద్కర్ చౌరస్తాలో శుక్రవారం జర్నలిస్టులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఏపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సంధర్బంగా ఆయన మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పెద్ద ఎత్తున దాడులు జరుగుతున్నాయన్నారు. జర్నలిస్టులపై దాడులను మానుకోవాలన్నారు. ప్రత్రికా స్వేచ్ఛను కాపాడాలని, పత్రాకా కార్యాలయాల మీద దాడులు ఆపాలన్నారు. లేదంటే భవిష్యత్‌లో మరిన్ని ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జర్నలిస్టు నాయకులు కూతురు రాజిరెడ్డి, రంగదాంపల్లి శ్రీనివాస్ గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, సంజీవరెడ్డి, చిటుకుల మైసారెడ్డి, నాగరాజు, ,యాదగిరిగౌడ్, జనార్థన్, శ్రీనివాస్, రవి, నరేష్, సాయి, ఇంద్ర శేఖర్, సంతోష్, మల్లారెడ్డి, రాజబాబు, అరుణ్, శ్రీకాంత్, శ్రీనాథ్, సాజిద్, రాంరెడ్డి, రమేష్, మురళి, చందు, రాజు, వంశీ, స్వామిగౌడ్, ముంజగిరి, వెంకట్, నరేష్, కృష్ణ, వెంకట్, గణేష్, గణేష్‌బాబు, పర్శరాములు, దయానంద్, మురళీకృష్ణ, రజనికాంత్, దర్శన్, దయానంద్, రాజు, సతీష్, ఇంద్రసేనారెడ్డి, సంతోష్, శ్రీకాంత్, వెంకటేష్, కుమారస్వామి, తులసి, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.





# చిత్త శుద్ధి తో బిసి రిజర్వేషన్ అమలు చేయాలి

- **రిజర్వేషన్ పై కాలయాపన చేసి బిసి లను మోసం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ..**
- **రేపటి బంద్ కి బి ఆర్ ఎస్ పార్టీ మద్దతు...**
- **మీడియా సమావేశం లో బి ఆర్ నేతలు..**

**సిద్దిపేట పవర్:**

రేపు 18న బిసి సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన బంద్ కి బి ఆర్ ఎస్ పార్టీ, మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు గారి పిలుపు మేరకు బంద్ కు మద్దతు ప్రకటిస్తున్నట్లు బి ఆర్ ఎస్ రాష్ట్ర పార్టీ కార్యదర్శి రాధాకృష్ణ శర్మ, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, తెలిపారు.. ఈ సందర్బంగా మాట్లాడుతు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారం లో కామారెడ్డి డిక్లరేషన్ పేరిట స్థానిక సంస్థల్లో 42% రిజర్వేషన్ ఇస్తా అని ఇప్పటి వరకు కూడా ఇవ్వకుండా, రాష్ట్రపతికి పంపామ్, గవర్నర్ కి పంపాము అని చేతులెత్తిస్తున్నారు.. గవర్నర్ కి పంపితే ఎందుకు ఒత్తిడి తేవడం లేదు.. రాష్ట్ర పతి కి పంపినప్పుడు 8 మంది ఎంపీ లు ఉంటే పార్లమెంట్ లోపే ఒక్కరూ కూడా మాట్లాడలే.. బిసి ల ముందు మేము చేసాం చేస్తున్నామని చట్ట బద్ధత కాకుండా పేరుకు అసెంబ్లీ లో ఆమోదం చేయడం ఇది కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన ను నిదర్శనం, బిసి లను మోసం చేస్తుంది ఈ కాంగ్రెస్ ప్రభుత్వం.. కాంగ్రెస్ పార్టీ కి చిత్త శుద్ధి ఉంటే దమ్ముంటే కేంద్ర ప్రభుత్వం పై ఒత్తిడి తెచ్చి రాష్ట్ర పతి ఆమోదం తెచ్చి చట్ట బద్ధత తేవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.. ఎలాంటి చట్ట బద్ధత లేకుండా ఎన్నికల నోటిఫికేషన్ వేసి ఎవరిని మోసం చేద్దాం అనుకున్నావ్ రేవంత్ రెడ్డి, బిసి లను మోసం చేయాలని చుస్తే ఊరుకోమ్ ఎన్నికలు నిర్వహించాలను కుంటే చిత్త శుద్ధి తో రిజర్వేషన్ అమలు చేసి నోటిఫికేషన్ అమలు చేయాలి..రేపు 18న జరిగె బంద్ కి బి ఆర్ ఎస్ పార్టీ మద్దతూ గా నిలుస్తాం.. బంద్ ని విజయవంతం చేద్దామన్నారు.. ఈ కార్యక్రమం లో పార్టీ సీనియర్ నాయకులు గుండు భూపేష్, పూజల వెంకటేశ్వర్లు (చిన్నా) కాముని శ్రీనివాస్, కిసర పాపయ్య, సదానందం, మెడికాయల వెంకటేశం, కనకరాజు, ఉమేష్, నరేష్ గౌడ్, శ్రీనివాస్, వేణు యాదవ్ రమేష్, సాయి, ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.



# దీర్ఘకాలిక కిడ్నీ వ్యాధితో బాధ పడుతున్న పేషెంట్‌కు విజయవంతంగా కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ నిర్వహించిన హైటెక్ సిటీ యశోద సిబ్బంది.

**సిద్దిపేట పవర్:**

సిద్దిపేట, అక్టోబర్ 17: దీర్ఘకాలిక మూత్ర పిండ వ్యాధి (CKD)తో బాధపడుతున్న 41 ఏళ్ల పేషెంట్ శ్రీ బాల గనగోని CKD నిర్వహణ కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ తర్వాత పూర్తిగా కోలుకున్నారు, ఈ విజయంతో హైటెక్ సిటీలోని యశోద హాస్పిటల్స్ అధునాతన మూత్రపిండ సంరక్షణలో మరో మైలురాయిని సాధించింది. సీనియర్ కన్సల్టెంట్ నెఫ్రాలజిస్ట్ డాక్టర్. మురళీనాథ్ ఉక్కడాల మరియు నెఫ్రాలజీ మరియు ట్రాన్స్‌ప్లాంట్ సర్వీసెస్ విభాగానికి చెందిన మల్టీడిసిప్లినరీ బృందం నిపుణుల సంరక్షణలో, పేషెంట్ సమగ్ర ప్రీట్రాన్స్‌ప్లాంట్ కార్డియాక్ పరీక్షలు చేయించుకున్నాడు, ఆ తర్వాత విజయవంతమైన కిడ్నీట్రాన్స్‌ప్లాంట్ మరియు నిరంతర శస్త్రచికిత్స అనంతర పర్యవేక్షణ జరిగింది. ట్రాన్స్‌ప్లాంట్‌కు ముందు చేసిన పరీక్షలు మితమైన ఎడమ జఠరిక పని చేయకపోవడం మరియు తేలికపాటి కొరోనరీ ఆర్టరీ వ్యాధిని వెల్లడించాయి. వైద్య స్థిరీకరణ మరియు క్లియరెన్స్ తర్వాత, ట్రాన్స్‌ప్లాంట్ ప్రక్రియ అద్భుతమైన ఫలితాలతో నిర్వహించబడింది. ట్రాన్స్‌ప్లాంట్చేయబడిన మూత్ర పిండం యొక్క కలర్ డ్యూప్లెక్స్ సోనోగ్రఫీ అల్ట్రాసౌండ్‌తో సహా శస్త్రచికిత్స తర్వాత వైద్య పరీక్షలు , తేలికపాటి పెల్వికలైసీయల్ ఫుల్‌నెస్‌తో సాధారణ అల్లోగ్రాఫ్ట్ పనితీరును నిర్ధారించాయి, ఇది మంచి గ్రాఫ్ట్ ఎబిలిటీ మరియు రికవరీని సూచిస్తుంది. ఈ కేసు గురించి డాక్టర్. మురళీనాథ్ మాట్లాడుతూ, "యశోద హాస్పిటల్స్‌లో, ప్రతి కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ పేషెంట్‌కు ప్రీట్రాన్స్‌ప్లాంట్ కార్డియాక్ అసెస్‌మెంట్ నుండి పోస్ట్‌ట్రాన్స్‌ప్లాంట్ రికవరీ వరకు వ్యక్తిగతీకరించిన, ఆధారాల సంరక్షణ లభిస్తుందని మేము నిర్ధారిస్తాము. మా బహుళ విభాగ విధానం సక్సెస్ రేట్ ను మెరుగుపరచడంలో పేషెంట్ జీవన నాణ్యతను మెరుగుపరచడంలో సహాయపడుతుంది." శ్రీ బాలా యొక్క కోలుకునే దశ స్థిరమైన మూత్రపిండ పనితీరు, సాధారణ కీలక పారామితులు మరియు దగ్గరి పర్యవేక్షణలో శస్త్రచికిత్స అనంతర సమస్యల పరిష్కారంతో ఆశాజనకమైన పురోగతిని చూపించింది. ఆహార సలహా, క్రమం తప్పకుండా తదుపరి షెడ్యూల్‌లు మరియు దీర్ఘకాలిక గ్రాఫ్ట్ కేర్ కోసం కౌన్సెలింగ్‌తో ఆయన డిశ్చార్జ్ అయ్యారు. మూడు దశాబ్దాలకు పైగా అత్యుత్తమ ప్రతిభ మరియు ప్రఖ్యాత నెఫ్రాలజిస్టులు, యూరాలజిస్టులు క్రిటికల్ కేర్ నిపుణుల బృందంతో, యశోద హాస్పిటల్స్ హైదరాబాద్‌లో కిడ్నీట్రాన్స్‌ప్లాంట్ సంరక్షణ మరియు అధునాతన నెఫ్రాలజీ చికిత్సలలో ముందంజలో ఉంది.



# బీసీ రిజర్వేషన్ల బంద్ పై భిన్నాభిప్రాయాలు

**సిద్దిపేట పవర్, అక్టోబర్ 17:**



బీసీ రిజర్వేషన్ల బంద్ పై భిన్నాభిప్రాయాలు తెలంగాణలో బీసీలకు 42% రిజర్వేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బీసీ జేఏసీ నేడు రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చింది.ఈ బంద్‌కు కాంగ్రెస్, బీఆర్ఎస్,బీజేపీతో సహా అన్ని పార్టీలు మద్దతు ఇవ్వడంతో, అసలు ఎవరిపై నిరసన అన్నది ప్రశ్నగా మారింది.న్యాయపరమైన, రాజ్యాంగపరమైన అడ్డంకులే రిజర్వేషన్లకు ప్రధాన సమస్యగా విశ్లేషకులు చెబుతున్నారు.ప్రభుత్వం బిల్లు చేసి గవర్నర్,రాష్ట్రపతుల ఆమోదం పొందినా,కోర్టులు వాటిని చెల్లుబాటు కాదని తీర్పు ఇచ్చాయి. రాజకీయ అంశం కాకుండా న్యాయ పరిమితులే అడ్డుకట్టగా ఉన్నాయని, బంద్‌తో ప్రజలకు ఇబ్బందులు తప్ప ప్రయోజనం ఉండదని నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

# నేడుబందును జయప్రదం చేయండి

- **అంబేద్కర్ సంఘం జిల్లా కార్యదర్శి కరికే రాములు**

**దుబ్బాక సిద్దిపేట పవర్ న్యూస్ 17 ప్ర-తినిధి**




నేడుబీసీ బందును జయప్రదం చేయాలని. స్థానిక దుబ్బాక లో. అంబేద్కర్ సంఘాల జిల్లా కార్యదర్శి కరికే రాములు విలేకరుల సమావేశం ఆయన మాట్లాడుతూ బీసీల 42 శాతం రిజర్వేషన్ అమలు కోసం. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బీసీ సంఘాలన్నీ. బందుకు పిలుపునిచ్చినాయని. అందులో భాగంగా. రేపు దుబ్బాక పట్టణంలో. వాణిజ్య వ్యాపార సంఘాలు. బందుకు సహకరించాలని. అఖిలపక్ష నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో. దుబ్బాక లో ఉన్న అన్ని రాజకీయ పక్షాలు. మరియు బీసీ సంఘాల నాయకులు. పాల్గొన్నారు.

# గుండెపోటుతో వ్యక్తి మృతి.

**సిద్దిపేట పవర్:**



సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలంలోని గురువన్నపేటలో గత సంవత్సరం సెప్టెంబర్ లో అదే గ్రామానికి చెందిన మైనర్ బాలికపై అదే గ్రామానికి చెందిన షర్బుద్దీన్ అనే యువకుడు లైంగిక దాడికి పాల్పడ్డాడు. కాగా అట్టి కేసు విషయంలో ఈరోజు తుది తీర్పు ఉండడంతో తన ఇద్దరు కుమారులతో సిద్దిపేట జిల్లా కోర్టులోకి వచ్చిన షర్బుద్దీన్ తండ్రి బడే సబ్ కోర్టుపాంగనంలోనే గుండెపోటుతో మృతి చెందాడు.

# మాదిగ ఉపకులాలకు న్యాయం చేసిన తొలి ప్రభుత్వం కాంగ్రెస్

- **ఎమ్మార్పీఎస్ నేత పెదమాతరి బాబు**

**సిద్దిపేట పవర్, అక్టోబర్ 17:**

30 ఏళ్లుగా సాగుతున్న ఎస్సీ వర్గీకరణ ఉద్యమానికి ఫలితంగా మాదిగ, మాదిగ ఉపకులాలకు న్యాయంచేసినతొలిప్రభుత్వంతెలంగాణకాంగ్రెస్ ప్రభుత్వమని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు ఎమ్మార్పీఎస్ నేత పెదమాతరి బాబు పేర్కొన్నారు. సిద్ధిపేట ప్రెస్ క్లబ్ లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకున్న ఈ నిర్ణయాన్ని వారు స్వాగతించారు. 1994లో ప్రారంభమైన మాదిగ రిజర్వేషన్ ఉద్యమం అనేక అవమానాలను ఎదుర్కొని, న్యాయ పోరాటంగా కొనసాగిందని, సామాజిక అసమానతలను ప్రశ్నించిందని వివరించారు. ప్రస్తుత ఎస్సీ జనాభా నిష్పత్తి ప్రకారం రిజర్వేషన్లు 15 నుంచి 18 శాతానికి పెంచాలంటూ ప్రభుత్వాన్ని కోరారు. అదే విధంగా రాజకీయ, సంక్షేమ రంగాల్లోకూడా ఎస్సీ వర్గీకరణ ప్రకారం అమలు జరగాలని విజ్ఞప్తి చేశారు.ఇక బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయడానికి సీఎం రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని, ఇది ఎంతో మంది వెనుకబడిన తరగతుల కలల్ని నెరవేర్చే చారిత్రాత్మక అడుగని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం జీవో 9 ద్వారా ఈ రిజర్వేషన్లను అమలు చేయనుండటం హర్షణీయం అన్నారు. టీఆర్ఎస్, బీజేపీ పార్టీలు కూడా ఈ నిర్ణయానికి మద్దతివ్వాలని డిమాండ్ చేశారు. ఈ ప్రకటనలో పాల్గొన్న ఎమ్మార్పీఎస్ నాయకులు బొందని రాజమల్లు మాదిగ, రోమాల బాబు మాదిగ, బాకూరి అశోకు, గాజుల శాల్మోహన్ రాజ్, గుండుకాడి భూపతి, కోపని చంద్రం, వేముల శ్రీనివాస్, కాటేపాక రాజు పాల్గొన్నారు.




# ఆరోగ్యశ్రీ రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడికి సన్మానం

**దుబ్బాక, సిద్దిపేట పవర్ అక్టోబర్ 17 ప్రతినిధి**

దుబ్బాక ప్రభుత్వాసుపత్రిలో ఆరోగ్యశ్రీ సేవలందిస్తున్న కమటం శ్రీహరి రాష్ట్ర ఆరోగ్యశ్రీ అసోసియేషన్ అధ్యక్షులుగా ఇటీవల ఎన్నికయ్యారు. ఈ విషయం తెలుసుకున్న దుబ్బాక మాల మహానాడు అధ్యక్షులు సునీల్ కుమార్ శుక్రవారం దుబ్బాక ప్రభుత్వాసుపత్రిలో శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే రోగులకు ఆరోగ్యశ్రీ పథకం ద్వారా అందే సేవలను జిల్లా రాష్ట్ర స్థాయిలో మరింత సేవలందించాలని కోరారు. అనంతరం శ్రీహరి మాట్లాడుతూ రాష్ట్రస్థాయి అసోసియేషన్ అధ్యక్ష పదవి రావడం సంతోషంగా ఉందని,రానున్న రోజుల్లో జిల్లా, రాష్ట్ర స్థాయి కమిటీలు ఏర్పాటు చేసి మరిన్ని సేవలందిస్తామన్నారు. దుబ్బాక మాదిరిగానే రాష్ట్ర స్థాయిలో పేరు ప్రఖ్యాతలు సంపాదించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆస ఆంజనేయులు, ఆస రాజశేఖర్, రాజు తదితరులున్నారు.



# మానభంగం కేసులో నేరస్తునికి 20 సంవత్సరాల జైలు శిక్ష

- **పోలీస్ కమిషనర్ విజయ్ కుమార్, ఐపీఎస్.,**
- **నేరస్తుని వివరాలు***
- **దరిపల్లి విట్టల్ తండ్రి అంజయ్య, వయస్సు 52 సంవత్సరాలు, గ్రామం మల్యాల మండలం చిన్నకోడూర్, జిల్లా సిద్దిపేట.**



**తెలంగాణ బ్యూరో, సిద్దిపేట పవర్ :**

పోలీస్ కమిషనర్ కేసు వివరాలు తెలియపరుస్తూ దుబ్బాక పోలీస్ స్టేషన్ పరిధిలోని ఒక గ్రామానికి చెందిన మహిళ తేదీ: 1706 2018 నాడు మహిళ కొడుకు బావమరిది పై నేరస్థుడు మహిళ ఇంటిలో ఒంటరిగా ఉన్నది చూసి బలవంతంగా కింద పడవేసి మానభంగం చేసినాడని ఫిర్యాదురాలు దరఖాస్తు ఇవ్వగా అప్పటి సీఐ పరశురాములలు, కేసు నమోదు చేసి పరిశోధన ప్రారంభించారు పై నేరస్తుని అరెస్టు చేసి జ్యుడిషియల్ రిమాండ్ కు పంపించడం జరిగింది. అప్పటి సీఐ కృష్ణ గౌడ్, తదుపరి కేసు పరిశోధన ప్రారంభించి టెక్నికల్ రిపోర్ట్స్ వచ్చిన తర్వాత కేసు పరిశోధన పూర్తిచేసి నేరస్తునిపై కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయడం జరిగింది. ఆరోజు నుండి ఈరోజు వరకు సిద్దిపేట 1st అడిషనల్ డిస్టిక్ & సెషన్స్ కోర్టులో కేసు విచారణ జరిగింది. ఈరోజు 1st అడిషనల్ డిస్టిక్ & సెషన్స్ జడ్జి శ్రీ జయప్రసాద్ గారు, ఇరువురి వాదనలు విన్న తర్వాత నేరస్తుని పై నేరం రుజువైన నందున పై నేరస్తునికి 20 సంవత్సరాల కఠిన కారాగార జైలు శిక్ష, 5 వేల రూపాయల జరిమానా విధించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ ఎస్. యం. విజయ్ కుమార్, ఐపీఎస్ గారు కేసు ఇన్వెస్టిగేషన్ పోలీస్ అధికారులను, సీఐలు పరశురాములు, కృష్ణ, దుబ్బాక సిఐ శ్రీనివాస్ ఎస్ఐ కీర్తిరాజు, పబ్లిక్ ప్రాసిక్యూటర్, కోర్టు విధులు నిర్వహించే అధికారులను సిబ్బందిని అభినందించారు.

# తెలంగాణా బంద్ కు బిసివై పార్టీ మద్దతు

- **బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాల్సిందే**
- **42 శాతం రిజర్వేషన్లు అమలు చేసి రేవంత్ రెడ్డి చిత్తశుద్ధి నిరూపించుకోవాలి**
- **రిజర్వేషన్ల సాధన కోసం జరిగే ఉద్యమంలో బిసివై పార్టీ కీలకపాత్ర పోషిస్తుంది**
- **బిసివై పార్టీ అధినేత బోడె రామచంద్రయాదవ్ కీలక వ్యాఖ్యలు**

**తెలంగాణ బ్యూరో, సిద్దిపేట పవర్ :**

బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలనే డిమాండ్ తో తెలంగాణాలో జరగనున్న బంద్ కు భారత చైతన్య యువజన పార్టీ మద్దతు ప్రకటించింది. ఈ మేరకు ఆ పార్టీ అధినేత బోడె రామచంద్రయాదవ్ శుక్రవారం ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. తెలంగాణాలో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాల్సిందేనన్నారు. తెలంగాణా ప్రభుత్వం బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించి తన చిత్తశుద్ధిని చాటుకోవాలని డిమాండ్ చేశారు. బిసి రిజర్వేషన్ల సాధన కోసం తెలంగాణాలో జరిగే ఉద్యమంలో ఇకపై బిసివై పార్టీ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. శనివారం జరిగే తెలంగాణా బంద్ కు అన్ని సంఘాలు సహకరించాలని కోరారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసే విషయంలో అధికారం అనుభవించిన




ఏ పార్టీ కూడా చిత్తశుద్ధిని కనపరచలేదన్నారు. జనాభా ప్రాతిపదికన బిసిలకు రిజర్వేషన్లు ఇవ్వాలన్నారు. 42 శాతం రిజర్వేషన్లు సమంజసమని తెలిసినా కూడా అమలు చేయడం కోసం ఎందుకు అవాంతరాలు సృష్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రిజర్వేషన్ల విషయంలో సవరణలు చేసి వెంటనే అమలు చేయాలి

# ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

- **మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ నాల్ల నాగుల శ్వేత వెంకట్ చారి**

**చేర్యాల, అక్టోబర్ 17 సిద్దిపేట పవర్**

ప్రభుత్వం రైతుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు వినియోగించుకోవాలని,రైతులు కష్టపడి పండించిన పంటను దళారుల చేతుల్లో పెట్టి మోసపోవద్దని మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ నాల్ల నాగుల శ్వేత వెంకట్ చారి అన్నారు. మండలంలోని రాంపూర్ గ్రామంలో శుక్రవారం వడ్ల కొనుగోలు కేంద్రాలను మార్కెట్ కమిటీ చైర్మన్ నాల్లనాగుల శ్వేత వెంకట్ చారి ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ శ్వేత వెంకట్ చారి మాట్లాడుతూ.. రైతుల సంక్షేమం కోసం కాంగ్రెస్ కృషి చేస్తోందని, పండించిన ప్రతీ గింజను కొనుగోలు చేస్తామన్నారు. ఏ గ్రేడ్ రకం ధాన్యానికి రూ.2,389, సాధారణ రకానికి చెందిన వడ్లకు రూ.2,369 చెల్లిస్తున్నట్లు తెలిపారు. దీంతో పాటు కాంగ్రెస్ సర్కార్ ఇచ్చిన మాట ప్రకారం సన్న రకం వడ్లకు క్వింటాల్ కు 500 రూపాయల బోనస్ చెల్లిస్తున్నామన్నారు. ధాన్యంను దళారులకు విక్రయించి మోసపోవద్దని రైతులకు సూచించారు. ప్రభుత్వం ప్రతి గింజను కొనుగోలు చేస్తుందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు.



# జరిగేది బై ఎలక్షన్ కాదు.. కాంగ్రెస్ కి, బీ జే పి కి బై బై ఎలక్షన్

- **జూబ్లిహిల్స్ లో బి.ఆర్.ఎస్ గెలుపు యావత్ తెలంగాణ ప్రజల గెలుపు**
- **చేర్యాల మండల బి.ఆర్.ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ బంగారీగళ్ల కిరణ్**

**చేర్యాల, అక్టోబర్ 17 (సిద్దిపేట పవర్)**



జూబ్లిహిల్స్ లో ప్రజలు బి.ఆర్.ఎస్ పార్టీ అభ్యర్థి మాగంటి సునీత కే పట్టం కడతారని చేర్యాల మండల బి.ఆర్.ఎస్. పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ బంగారీగళ్ల కిరణ్ తెలిపారు..ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ హైదరాబాద్ పట్టణాన్ని ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు తెచ్చింది బి.ఆర్.ఎస్ పార్టీ యేనని, ఇపుడు ఆ ప్రాంత ప్రజలకు బి.ఆర్.ఎస్ పార్టీ రుణం తీర్చుకునే సమయం వచ్చింది అని తెలిపారు...అదే విధంగా గత కొన్ని సంవత్సరాలుగా మాగంటి గోపీనాథ్ ను జూబ్లిహిల్స్ ప్రజలు గెలిపించారు అని, ఇపుడు అదే విధంగా వారి భార్య అయిన మాగంటి సునీత ను కూడా గెలిపిస్తారు అని నమ్మకం ఉంది అని కిరణ్ ఆశాభావం వ్యక్తం చేశారు..

# తహసిల్దార్ కార్యాలయం ఎదుట నల్లజెండాలతో నిరసన

- **సీజేఐపై జరిగిన దాడిని ఖండిస్తూ ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీఎస్ నిరసన**

**నంగునూరు, అక్టోబర్ 17(సిద్దిపేట పవర్)**

గౌరవ పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశానుసారం తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాలలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సిజెఐ గవాయిపై న్జరిగిన దాడిని ఖండిస్తూ నిరసన వ్యక్తం చేయడం జరిగింది దాంట్లో భాగంగానే ఈరోజు నంగునూరు తహసిల్దార్ కార్యాలయం ఎదుట నల్ల జెండాలతో నిరసన వ్యక్తం చేయడం జరిగింది ఎమ్మార్పీఎస్ ఎంఎస్పిఎస్ అన్ని అనుబంధ సంఘాల నాయకులు పాల్గొని దళితుల మీద జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండించారు అంతేకాకుండా సిజెఐ పై జరిగిన దాడి ప్రజాస్వామ్యం మీద రాజ్యాంగం మీద జరిగినట్టుగా భావిస్తూ ఈరోజు కార్యాలయం వద్ద నిరసన నిరసన వ్యక్తం చేసి తహసిల్దార్ కు మెమోరాడం సమర్పించడం జరిగింది దళితుల బహుజనుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా వ్యవహరించిన రాకేష్ కిషోర్ గారి పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు దాడి జరిగి దాదాపు పది రోజులు పూర్తి అయినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు జస్టిస్ బి.ఆర్ గవాయి గారిపై రాకేష్ కిషోర్ అనాగరిక చర్య తన బూతు విసరడంపై తీవ్రంగా ఆక్షేపించారు ఈ చర్య మొత్తం దళితులు బహుజనుల పై పరిగ నిస్తున్నాం దాడికి పాల్పడిన వ్యక్తి పైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాం ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుల ఏపీఎస్పీ మండల అధ్యక్షులు దేవులపల్లి బాలరాజు గ్రామ శాఖ అధ్యక్షుడు పాపి గారి నరేష్ ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు దేవులపల్లి హరిబాబు దేవులపల్లి రమేష్ దేవులపల్లి శంకర్ కందికట్ల రాజు తదితరులు పాల్గొన్నారు




# జీతాలు లేక తమకు పండుగకు పస్తులేనా....?

- **మూడు నెలలుగా జీతాలు లేని గాంధీ ఔట్ సోర్సింగ్ నర్సింగ్ సిబ్బంది..**

**సికింద్రాబాద్,అక్టోబర్ 17 ( సిద్దిపేట పవర్ ) :**

గాంధీ ఆసుపత్రిలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ నర్సింగ్ సిబ్బందికి గత జూలై నెల నుంచి జీతాలు అందక నానా ఇబ్బందులు పడుతున్నారని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహా ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం పలువురు నర్సింగ్ సిబ్బందితో కలసి సూపరింటెండెంట్ కు ఈవిషయమై వినతిపత్రం సమర్పించారు. ఈసందర్బంగా వారు మీడియాతో మాట్లాడుతూ.. దాదాపు 20 ఏండ్లుగా గాంధీ ఆసుపత్రిలో ఔట్ సోర్సింగ్ నర్సింగ్ సిబ్బంది పనిచేస్తున్నారని, తక్కువ జీతాలతో పనిచేస్తున్న తమకు ప్రస్తుతం మూడు నెలలుగా జీతాలు అందక ఆర్థికంగా అనేక ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. కాంట్రాక్టర్లు జీతాలు చెల్లించడంలో విఫలం అయితే ముఖ్య యజమానిగా ఉన్న ఆసుపత్రి సూపరింటెండెంట్ నర్సింగ్ సిబ్బందికి జీతాలు చెల్లించాలని కాంట్రాక్ట్ చట్టం సూచిస్తుందని నరసింహా పేర్కొన్నారు. పండుగల సందర్భంగా కూడ ఉద్యోగులకు జీతాలు లేక పస్తులు ఉండే దుస్థితి ఉందన్నారు. కాంట్రాక్టర్లు ఎక్కువ మంది ఉండటంతో ఈ దుస్థితి నెలకొందన్నారు. స్పందించిన సూపరింటెండెంట్ డా.వాణి మాట్లాడుతూ..సంబంధిత కాంట్రాక్టర్ తో మాట్లాడి రేపటిలోగా జీతాలు ఇప్పిస్తామని అన్నారు. కార్యక్రమంలో గాంధీ నర్సింగ్ ఆఫీసర్స్ యూనియన్ నాయకులు డి.సుందరమ్మ, ఎం.నాగమణి,ఈ. అనిత, బి.పుణ్యమ్మ, శోభారాణి, లక్ష్మీ ప్రబలత, రాజేశ్వరీ పాల్గొన్నారు.



# నేడు జరిగే బీసీ బందు కు తెలంగాణ ప్రజా ఫ్రంట్ మద్దతు

**సిద్దిపేట పవర్ అక్టోబర్ 17 మిరుదొడ్డి**

ఈనెల 18 న జరగబోయే బందుకు తెలంగాణ ప్రజా ఫ్రంట్ మద్దతు ప్రకటిస్తుందని ప్రజా ఫ్రంట్ రాష్ట్ర నాయకులు సత్తయ్య, తాళ్లపల్లి చంద్రం గౌడ్ లు అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పార్లమెంటరీ పాలక పార్టీలు ఆడుతున్న రాజకీయ నాటకాన్ని ప్రజలు తరిమి కొట్టాలని అన్నారు.న్యాయబద్ధంగా రాజ్యాంగబద్ధంగా ఎవరి జనాభా ఎంతో జనాబాధమాషా ప్రకారం ప్రజలకు దక్కాల్సిన న్యాయమైన హక్కుల సాధన కోసం అనగారిన పీడిత ప్రజలకు మద్దతుగా నిలబడాలని వారు తెలిపారు. నేటి బందును జయప్రదం చేయాలని వారు కోరారు. ఎస్సీ ఎస్టీ బీసీ నాయకులు ఏకమై పార్టీలకు అతీతంగా బీసీ బందుకు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రజా ఫ్రంట్ , ఉమ్మడి జిల్లా అద్యక్షుడు జంగిడి నర్సింలు, మంతూరి శ్రీశైలం, ఏల్లం, లింగం, వెంకట్, దుర్గ రాంబాబు తదితరులు పాల్గొన్నారు..



# జూబ్లీహిల్స్ లో ఎగరబోయేది కాంగ్రెస్ పార్టీ జెండానే

- **పీసీసీ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ కోట నీలిమ**

**సికింద్రాబాద్, అక్టోబర్ 17 ( సిద్దిపేట పవర్ ) :**

జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఎగరబోయేది కాంగ్రెస్ పార్టీ జెండానే అని పీసీసీ ఉపాధ్యక్షురాలు, సనత్ నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి డాక్టర్ కోట నీలిమ అన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ నామినేషన్ కార్యక్రమం అశేష జనసందోహం మధ్య అంగరంగ వైభవంగా జరిగింది. కాగా ఈ కార్యక్రమానికి కోట నీలిమ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జూబ్లీహిల్స్ లో జరుగుతున్నది పదేళ్ల విధ్వంస పాలనకు.. రెండేళ్ల వికాస పాలనకు మధ్య జరుగుతున్న ఎన్నిక అన్నారు. జూబ్లీహిల్స్ గెలుపు బాధ్యత కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలదే అని తెలిపారు. ప్రజల మధ్య ఉండే నాయకుడు కావాలి కాబట్టే నవీన్ యాదవ్‌ను పార్టీ అభ్యర్థిగా అధిష్టానం ప్రకటించిందని వెల్లడించారు. నవీన్ యాదవ్‌ను గెలిపిస్తే ప్రజల మధ్యనే ఉంటారన్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించే నవీన్ యాదవ్‌ను జూబ్లీహిల్స్ ప్రజలు ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరుకుంటున్నారని తెలిపారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఒక్క డబుల్ బెడ్ రూమ్, ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదనన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 40 లక్షల రేషన్ కార్డులు ఇచ్చామని చెప్పుకొచ్చారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో పదేళ్ల పాలనలో ఎలా జరిగిందో ప్రజలు ఆలోచించాలని కోరారు. నవీన్ యాదవ్‌ను గెలిస్తే జూబ్లీహిల్స్ నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో 85 శాతం పేద, మధ్యతరగతి జనం ఉన్నారని.. కాంగ్రెస్ గెలిస్తేనే వారికి న్యాయం జరుగుతుందని వెల్లడించారు.బీసీ రిజర్వేషన్లకు కట్టుబడి కాంగ్రెస్ బీసీ అభ్యర్థిని ప్రకటించిందని తెలిపారు. సర్వేల ఆధారంగా జూబ్లీహిల్స్‌లో నవీన్ యాదవ్ భారీ మెజారిటీ తో గెలవబోతున్నారని అన్నారు. కాంగ్రెస్ కార్యకర్తల కృషితో 50 వేలకు పైగా మెజార్టీతో నవీన్ యాదవ్ గెలవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. నవీన్ యాదవ్‌ను గెలిపించి సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గేకు బహుమతిగా ఇవ్వాలని పిలుపునిచ్చారు.



# చార్వాక మోడల్ స్కూల్లో ఘనంగా దీపావళి సంబరాలు.

**సిద్దిపేట పవర్ భూంపల్లి. అక్టోబర్ 17**

అక్బర్పేట్ భూంపల్లి మండలం లోని వీరారెడ్డి పల్లి గ్రామంలోని చార్వాక మోడల్ స్కూల్ లో ఘనంగా దీపావళి సంబరాలు నిర్వహించారు చార్వాక మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ ధర్మారం కుమార్ మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు పుట్టినిల్లుగా అంటూ చెడుపై మంచి విజయం సాధించడమే దీపావళి యొక్క గొప్పతనం అన్నారు విద్యార్థులందరూ మంచిగా చదువుకొని తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలన్నారు అలాగే విద్యార్థులు దీపం ఆకృతిలో కూర్చొని అందరినీ అబ్బురపరిచారు విద్యార్థులు వారు తీసుకువచ్చిన చాట్స్ తో దీపాలను తయారుచేసి పువ్వులతో ముగ్గులను అలంకరించి స్వీట్స్ పంచుకొని దీపావళి సంబరాలు జరుపుకున్నారు అలాగే ఇంటి వద్ద టపాకాయలు క్రాకర్ కాల్చేటప్పుడు తగు జాగ్రత్త తీసుకోవాలి అన్నారు ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు శ్యామయ్య



కళ్యాణి వాణి శ్రీలత స్వాతి రాజేందర్ నవ్య అఖిల రాణి ప్రశాంత్ తదితరులు పాలుగోన్నారు